ప్రజాశక్తి
శనివారం 26 అక్టోబర్ 2024 8 పేజీలు
ఎన్‌టిఆర్ కృష్ణా







పశ్చిమ తహశీల్దారు కార్యాలయం వద్ద దరఖాస్తులతో బాధితులు

వరద సాయంలో ప్రభుత్వం విఫలం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు
- భవానీపురం పశ్చిమ తహశీల్దారు ఆఫీసు వద్ద బాధితుల ధర్నా

ప్రజాశక్తి - వన్‌టౌన్ : బుడమేరు వరదలు వచ్చి 55 రోజులైనా నేటికీ బాధితులకు ఆర్థిక సహాయం అందించటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు విమర్శించారు. సహాయం అందక ఆగ్రహించిన వరద బాధితులు శుక్రవారం భవానీపురంలోని పశ్చిమ మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. వందలాదిమంది తమకు వరద సహాయం అందలేదని దరఖాస్తులు చేతపట్టి ధర్నాలో పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుతూ సమాధానం చెప్పకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రభుత్వంపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు దరఖాస్తులు పెట్టాలని, విచారణ జరపకుండా కాలయాపన చేయటం ఏమిటని ప్రశ్నించారు. ఈ ధర్నాలో బాబురావుతోపాటు సిపిఎం పశ్చిమ సిటీ కార్యదర్శి, విఎంసిలో సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలోని 13 డివిజన్లలో సిపిఎం తరఫున వరద బాధితుల వివరాలను సేకరించగా, ఇంకా 45 శాతానికిపైగా బాధితులకు వరద సహాయం అందలేదని తెలిపారు. పశ్చిమంలోని కబేళా, ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డు, ఊర్మిళానగర్, భవానీపురం, ప్రియదర్శినీ కాలనీ, రాజరాజేశ్వరీపేట ప్రాంతాలు పూర్తిగా (మిగతా 2లో)

రిజిస్ట్రేషన్ల ఆదాయం అరకొరే !

- అర్ధ సంవత్సరంలో ఆదాయం రూ.186.52 కోట్లు
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తగ్గిన ఆదాయం

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

ప్రభుత్వాలు సాధించే వృద్ధి ఫలితాలు ఎక్కువగా భూ లావాదేవీలపై ప్రభావం ఉంటుందని నిపుణులు చెబుతారు. భూ లావాదేవీలకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ ద్వారా ప్రభుత్వానికి సమకూరే ఆదాయాన్ని గీటురాయిగా చూపుతారు. తాజాగా అమరావతి రాజధాని, గన్నవరం విమానాశ్రయం, మచిలీపట్నం ఓడరేవు, మల్లవల్లి పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేస్తున్నామని ప్రభుత్వం ఊదరగొడుతున్నా భూ లావాదేవీలపై ఆ ప్రభావం స్వల్పంగానే ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరం మొదటి ఆరునెలల్లో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖకు సమకూరిన ఆదాయాన్ని గతేడాదితో పోలిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుంటే కేవలం 1.91 శాతం మాత్రమే ఆదాయం వృద్ధి చెందింది.

లక్ష్యానికి దూరంగా ...

2023-24 ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో రూ.186.52 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ చివరి నాటికి రూ.190.08 కోట్ల ఆదాయం వచ్చింది. అంటే స్వల్పంగా రూ.3.56 కోట్ల ఆదాయం మాత్రమే పెరిగింది. వృద్ధి 1.91 శాతంగా మాత్రమే ఉంది. ప్రభుత్వం 13 కార్యాలయాలకు మొదటి ఆరు నెలల్లో రూ.264.67 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా నిర్దేశించింది. లక్ష్యంతో పోల్చినప్పుడు రూ.74.59 కోట్ల ఆదాయం తక్కువగా సమకూరింది.

సగానికిపైగా కార్యాలయాల్లో తగ్గిన ఆదాయం

అమరావతి రాజధాని ప్రభావంతో విజయవాడ సమీపంలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు పరిసర ప్రాంతాలపైన, మచిలీపట్నం పోర్టు ప్రభావంతో మచిలీపట్నం, చల్లపల్లి ప్రాంతాల్లో, నిమ్మకూరులో నూతనంగా నిర్మించిన బెల్ కంపెనీ కార్యకలాపాలు ప్రారంభం కావడంతో పామర్రు పరిసరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం కొంత పుంజుకుంది. వీటి పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భూ లావాదేవీలు ఎక్కువగా జరగడమే దీనికి నిదర్శనం.



మచిలీపట్నం 9.53 శాతం, చల్లపల్లి 16.56 శాతం, ఉయ్యూరు 10.99 శాతం, కంకిపాడు 21.53 శాతం, కానుమోలు 1.65 శాతం, పామర్రు 4.92 శాతం చొప్పున స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో గతేడాదికన్నా ఆదాయాలు పెరిగాయి. అయితే కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ఆదాయం తగ్గింది. అవనిగడ్డ 32.41 శాతం, బంటుమిల్లి 46.58 శాతం, గుడివాడ 13.50, కౌతవరం 11.97, మొవ్వ 20.25, పెడన 25.76, గన్నవరం 1.67 శాతం మేర ఆదాయం గతేడాదికన్నా తగ్గింది. గన్నవరంలో విమానాశ్రయం, వీరపనేనిగూడెంలో ఎంఎస్ఎంఇ (ఇండస్ట్రియల్) పార్కు, మల్లవల్లిలో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసినా ఆ ప్రాంతంలో భూ లావాదేవీలు పెరగలేదు.

తగ్గిన ఆదాయం భర్తీ ఎలా ?

భూమి విలువపై సేల్ డీడ్‌కు 6.5 శాతం, స్టాంప్ ఫీజు 1 శాతం, రిజిస్ట్రేషన్‌కు 2 శాతం, గిఫ్ట్ డీడ్ స్టాంపుకు 0.5 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజు 0.5 శాతం, మార్టిగేజ్‌కు 0.5, స్టాంపు ఫీజు 1శాతం చొప్పున రిజిస్ట్రేషన్ ఫీజులు చెల్లించాలి. ఈ ఫీజుల ద్వారానే పెద్ద మొత్తంలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. అయితే రిజిస్ట్రేషన్ ఆదాయం లక్ష్యానికన్నా తగ్గినప్పుడల్లా ప్రభుత్వం భూముల విలువ పెంచి భారం మోపుతోంది. గత ప్రభుత్వం ప్రతి ఏటా భూముల విలువను పెంచుతూ పోయింది. తాజాగా లక్ష్యానికి, ఆదాయానికి భారీ వ్యత్యాసం ఉండటంతో ప్రభుత్వం ఏవిధంగా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.



వార్త 8లో

చిరువ్యాపారులపై అధికారుల జులుం

- లెనిన్ సెంటర్లో షాపుల తొలగింపు

1,80,098 మందికి రూ.296.82 కోట్లు జమ

- ఇన్చార్జి కలెక్టర్ నిధి మీనా

ప్రజాశక్తి - విజయవాడ : ఇటీవల వరద ముంపు ప్రభావంతో నష్టపోయిన ప్రతి కుటుంబానికీ ప్రభుత్వం పరంగా ఆర్థిక సహాయం అందించామనిజిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ డా. నిధి మీనా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 1,80,098 మంది బాధితుల ఖాతాల్లో రూ.296.82 కోట్లు నేరుగా జమచేసినట్లు తెలిపారు. గత సెప్టెంబర్‌లో సంభవించిన వరదలతో జిల్లాలో 179 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని ప్రజలు ఇబ్బందిపడ్డారని.. బాధితులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నష్ట గణన చేపట్టి, బాధితుల ఖాతాల్లో నేరుగా ఆర్థిక సహాయం జమచేసినట్లు తెలిపారు. ఇళ్లు, ఎంఎస్ఎంఈ, వాహనాలు, వ్యవసాయం, పశుసంవర్ధక, మత్స్య, చేనేత, ఉద్యానవన తదితరాల నష్టాలకు సంబంధించి శుక్రవారం నాటికి 1,80,098 మంది బాధితుల ఖాతాల్లో డీబీటీ ద్వారా రూ. 296.82 కోట్లు జమచేసినట్లు వివరించారు. లబ్ధిదారుల జాబితాలను సచివాలయాల్లో ప్రదర్శించడం జరిగిందని.. ఆపై అదనంగా ప్రజల నుంచి కలెక్టరేట్‌లో స్వీకరించిన దరఖాస్తులను పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్)లో నమోదుచేసి, పరిశీలించినట్లు తెలిపారు. ఇలా నమోదుచేసిన 2,954 దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన బాధితులకు సంబంధించి ఆధార్‌తో అనుసంధానించిన బ్యాంకు ఖాతాల్లో సాయం జమ చేసినట్లు వెల్లడించారు. 256 దరఖాస్తుల కు సంబంధించిన డేటా అందుబాటులో లేనందున, నగదు జమకాలేదని, వీటి వివరాలను కూడా తీసుకొని, సాయాన్ని జమచేస్తామని తెలిపారు.

అనధికార ఆక్రమణలను తొలగించండి

విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం

ప్రజాశక్తి-విజయవాడ : అనధికార ఆక్రమణలను తొలగించేందుకు ప్రతి ఒక్క సెక్రటరీ దగ్గర మాస్టర్ ప్లాన్ ఖచ్చితంగా ఉండాలని, మున్సిపల్ మరియు ప్రభుత్వ స్థలాలను సంరక్షించుకోవాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం విఎంసి ప్రధాన కార్యాలయంలో ప్లానింగ్ సిబ్బందితో జరిగిన సమీక్షా సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ.... అనధికార ఆక్రమణలను అడ్డుకోవాలన్నారు. అనధికార బ్యానర్లు, హోర్డింగ్ లు ఎక్కడా లేకుండా చర్యలు తీసుకోవాలని, అధికార ఓటింగ్లకు ఖచ్చితంగా స్ట్రక్చరల్ స్టెబిలిటీ సర్టిఫికెట్ చూసుకోవాలని. అనధికార ఆక్రమణలు, అనధికార కట్టడాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని ఆదేశించారు. సెక్రటరీ సిబ్బంది అందరూ ఒకరితో ఒకరు సమన్వయంతో పని చేయాలని, సచివాలయం పరిధిలో ఉన్న ఏ సమస్య అయినా సమన్వయంతో త్వరగా పరిష్కరించగలరని అన్నారు. ఈ సమావేశంలో చీఫ్ సిటీ ప్లానర్ జి వి జి ఎస్ వి ప్రసాద్,డిసిపి చంద్రబోస్, ఏసీపీ మోహన్ బాబు, ప్లానింగ్ సిబ్బంది, సచివాలయం ప్లానింగ్ సెక్రటరీలు, పాల్గొన్నారు.

సిపిఎంపై విమర్శలు మాని బాధితులను ఆదుకోండి

- ఎంఎల్ఎ బొండాకు సిపిఎం రాష్ట్ర నేత కాశీనాథ్ హితవు
- వరదలప్పుడు ఎవరెక్కడున్నారో ప్రజలకు తెలుసు



మీడియాతో మాట్లాడుతున్న సిపిఎం నేత దోనేపూడి కాశీనాథ్

ప్రజాశక్తి - విజయవాడ : సెంట్రల్ ఎంఎల్ఎ బొండా ఉమా రాజకీయ విమర్శలు మాని వేలాది మంది వరద బాధితులను ఆదుకోవడంపై దృష్టి పెట్టాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ హితవు పలికారు. వరద బాధితులకు అనునిత్యం తోడుగా, అండగా నిలిచి అన్ని విధాలుగా ఆదుకున్న సిపిఎంను, తమ పార్టీ నేత సిహెచ్.బాబూరావును విమర్శించడం మానుకొని, సర్వం కోల్పోయి ఇంకా సాయం కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది బాధితులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే వరద బాధితుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. స్థానిక శ్రీశ్రీ భవన్లో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ వరద బాధితుల కోసం పోరాడుతున్న బాబురావుపైన, సిపిఎంపైన అనుచిత వ్యాఖ్యలు చేయటం తగదన్నారు. ఇటువంటి అవాకులు, చవాకులు మానుకోవాలన్నారు. 10 రోజులపాటు బాబురావు, సిపిఎం కార్యకర్తలు వరద నీటిలో దిగి క్షేత్రస్థాయిలో బాధితులను ఆదుకున్నారని, ఆ సమయంలో ఎంఎల్ఎ ఎక్కడ ఉన్నారో ప్రజలకు తెలుసునని అన్నారు. వరదలను సైతం అడ్డంపెట్టుకొని ఎవరు బాగుపడ్డారో, ప్రజలకు ఎవరు సేవ చేశారో సింగ్‌నగర్ ప్రాంతంలోని ప్రతి ఒక్కరికీ తెలుసునన్నారు. తమ పార్టీ నేతలు ప్రతి ఇంటింటికీ, గడపగడపకు సేవలందించారని తెలిపారు. వరదల్లో సర్వం కోల్పోయి (మిగతా 2లో)

అమరావతికి రైల్వేలైన్ హర్షణీయం : ఎంపి

ప్రజాశక్తి - విజయవాడ : అమరావతికి రైల్వేలైన్ హర్షణీయమని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది రాష్ట్రానికి భారీ ప్రోత్సాహమని పేర్కొన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, సీఎం చంద్రబాబులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అమరావతితో పాటు వెనుకబడిన ప్రాంతలైన మైలవరం, నందిగామ కూడా కలిసే విధంగా ఈ రైల్వే లైన్ వుండటం ఆ ప్రాంతాల అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

యువతకు నైపుణ్యంపై వర్క్‌షాపు

ప్రజాశక్తి - విజయవాడ : పరిశ్రమతో రాష్ట్ర యువతను మమేకం చేసే లక్ష్యంతో వారికి శిక్షణ అందించి మెరుగైన ఉపాధితో మంచి జీవితాలను అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ఉపాధి కల్పన మరియు వ్యవస్థాపన అభివద్ధి సంస్థ (సీడ్ యాప్ సంస్థ) కషి చేస్తుందని సంస్థ చైర్మన్ దీపక్ రెడ్డి గుణపాటి తెలిపారు. ఎనిమిది సెక్టార్ల వారితో ఎన్టీఆర్ పరిపాలనా భవనంలోని సీడ్ యాప్ కార్యాలయంలో శుక్రవారం యువతకు శిక్షణ, ఉపాధి పై వర్క్ షాపు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సీడ్ యాప్ సంస్థ చైర్మన్ దీపక్ రెడ్డి గుణపాటి మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమలకు అవసరమైన శిక్షణ, నైపుణ్యం కల్గిన యువతను అందించేందుకు సీడ్ యాప్ సన్నద్ధంగా ఉందన్నారు. ఆర్థిక వ్యవస్థను మెరుగుపరిచేందుకు ఉద్దేశించిన అత్యాధునిక ఆరు విధానాల రూపకల్పనలో సీడ్ యాప్ ఉందన్నారు.. రాష్ట్రంలో పరిశ్రమలను స్థాపించే వారికి స్కిల్డ్ యువతను అందిస్తామన్నారు. దీనివల్ల రాష్ట్రంలోని యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. ప్రస్తుతం మరియు భవిష్యత్ లో పరిశ్రమల డిమాండ్లకు అవసరమైన వారి కోసం నైపుణ్యాభివద్ధి కార్యకలాపాలను ప్లాన్ చేయడానికి ఇది సరైన సమయమన్నారు. సీడ్ యాప్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డా. కె. శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ 2005 నుండి వివిధ నైపుణ్యాభివద్ధి పథకాలను రాష్ట్రంలో అమలు చేయడంలో సీడ్ యాప్ సంస్థ విజయవంతమైన ట్రాక్ రికార్డ్‌ను కలిగి ఉందన్నారు. ప్రస్తుతం భారతదేశ ప్రభుత్వ చొరవ తో 'దీన్ దయాళ్ ఉపాధ్యాయ' అమలులో రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి - విజయవాడ : గవర్నరుపేట సెక్షన్ మ్యూజియం విద్యుత్ ఉపకేంద్రం 11 కేవీ మ్యూజియం రోడ్డు ఫీడర్, తోటవారి స్ట్రీట్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మత్తులు, మెయింటినెన్స్ నిమిత్తం పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 7 నుండి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎపిసిపిడిసిఎల్ విజయవాడ టౌన్ కార్యనిర్వాహక ఇంజనీరు పి.రవీంద్రబాబు తెలిపారు. మ్యూజియం రోడ్డు, దుర్గయ్య వీధి, కాలేశ్వరరావు రోడ్డు,మల్లాది వారి వీధి, ఏలూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. తోటవారి వీధి ఫీడర్ పరిధిలో తోట వారి స్ట్రీట్ , వైఎస్సార్ రోడ్ , రోడ్ , సిద్ధార్థ స్ట్రీట్, సాగి హనుమ మంత్ రావు ర స్ట్రీట్, వినాయక కాలనీ, భారత మాత కాలనీ , భరత మాత మందిర్ రోడ్ , ఉప్పలపాటి సీత రామ రాజు రోడ్ , ఆర్ అండ్ బి కాలనీ పరిసర ప్రాంతాలలో ఉదయం 8 నుండి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు.

జోగి ఎక్కడ ?

- **మైలవరం ఇన్చార్జిగా నియమితులైనా కనిపించని వైనం**
- **వ్యతిరేకిస్తున్న వైసిపి శ్రేణులు !**



ప్రజాశక్తి - జి.కొండూరు : మైలవరం నియోజకవర్గంలో ప్రతిపక్షం జాడే కనిపించడంలేదు. వైసిపి నియోజకవర్గ ఇన్చార్జి జోగి రమేష్ ఎక్కడా కనిపించిన పరిస్థితి లేదు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో బిసి సామాజిక వర్గానికి చెందిన సర్నాల తిరుపతిరావును వైసిపి బరిలో దింపింది. రాష్ట్రం మొత్తం కూటమి హవా ఉండటంతో మైలవరం సీటు కూడా టిడిపి గెలుచుకుంది. ఎన్నికల సమయంలోనూ అభ్యర్థి తిరుపతిరావును పార్టీ శ్రేణులు వ్యతిరేకించాయి. అయినా అధిష్టానం ఆయననే కొనసాగించింది. అయితే ఎప్పటినుంచో జోగి రమేష్‌కు మైలవరం నుండి పోటీ చేయాలనే ఆసక్తి ఉంది. కానీ రాజకీయ సమీకరణాల్లో భాగంగా ఆయనను అధిష్టానం 2019లో పెడన నుండి, 2024లో పెనమలూరు నుండి బరిలోకి దింపింది. అయితే రాష్ట్రంలో వైసిపి [illegible] ఓటమిపాలవడంతో ఇటీవల కాలంలో నియోజకవర్గాల్లో చేర్పులు మార్పులు చేస్తోంది. దీనిలో భాగంగా జోగి రమేష్‌ను మైలవరం నియోజకవర్గ ఇన్చార్జిగా నియమించింది. కానీ ఆయనను అభినందించడానికి నియోజకవర్గం నుండి నాయకులుగానీ, కార్యకర్తలుగానీ వెళ్లలేదు. ఆయన కూడా ఇప్పటి వరకు పార్టీ శ్రేణులతో సమావేశం కూడా ఏర్పాటు చేయలేదు. ఈ నేపథ్యంలో స్థానికంగా వైసిపి శ్రేణులు ఆయనను వ్యతిరేకిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. సొంత సామాజిక వర్గానికి చెందిన ప్రముఖ నాయకులే జోగిని వ్యతిరేకిస్తున్నట్లు తెలిసింది. నియోజకవర్గ పరిధిలోని జి కొండూరు, మైలవరం , రెడ్డిగూడెం మండలాల్లోని ముఖ్య నేతలు ఆయనను వ్యతిరేకిస్తున్నట్లు తెలిసింది. జోగిని మార్చకపోతే భవిష్యత్తులో కేడర్‌ను నిలబెట్టుకోవడం కూడా పార్టీకి కష్టమవుతుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాపై, బుడమేరు వరదల్లో రైతులు, ప్రజలు తీవ్రంగా నష్టపోయినా జోగి మాత్రం ఎవరినీ పరామర్శించిది లేదు. నోరు మెదిపిందిలేదు. వైసిపి తరపున వరద బాధితులకు అండగా నిలబడిన దాఖలాలే లేవు. అంతేగాక వైసిపి ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న జోగి మైలవరం నియోజకవర్గానికి ఏం చేయలేదనే విమర్శలు కూడా వస్తున్నాయి.

టిడిపిలోకి జోగి రమేష్?

మాజీ సిఎం జగన్‌కు అత్యంత సన్నిహితల్లో జోగి రమేష్ ఒకరు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు ఇంటిపై దాడి కేసులో జోగితోపాటు ఆయన అనుచరులకు కూడా పోలీసులు నోటీసులు జారీ చేసి అరెస్టు చేశారు. అంతేగాక ఆయన అవినీతి అక్రమాలను వెలికి తీసేపనిలో టిడిపి ఉంది. దీనిలో అగ్రిగోల్డ్‌కు సంబంధించిన భూముల వ్యవహారం ప్రధానంగా ఉంది. ఈకేసుల నుండి బయట పడాలంటే టిడిపిలోకి వెళ్లడమే శరణ్యమని భావించి ఆ పార్టీ ముఖ్య నేతలతో ఆయన టచ్‌లో ఉన్నట్టు వినికిడి.

నేషనల్ అర్బన్ లైవ్లీ హుడ్ మెషిన్ 2.0పై సమీక్ష

ప్రజాశక్తి-విజయవాడ : నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ లో నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్ మిషన్ 2.0 అంశంపై మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ జాయింట్ సెక్రటరీ కుల్దీప్ నారాయణ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. నేషనల్ అర్బన్ లవ్లీ హుడ్ మిషన్ 2.0 ద్వారా కేంద్ర ప్రభుత్వం 6 క్యాటగిరి లో ఉన్న కామన్ ఇంట్రెస్ట్ గ్రూపులకు ఋణ సదుపాయం కల్పించేందుకు పైలెట్ ప్రాజెక్ట్ గా విజయవాడ, విశాఖపట్నం ను ఎంపిక చేయగా వాటిని మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ జాయింట్ డైరెక్టర్ కుల్దీప్ నారాయణ సమీక్షించారు. నేషనల్ అర్బన్ లైవ్లి హుడ్ మెషిన్ 2.0 అమలు కొరకు నవంబర్ 1 నుండి పైలెట్ ప్రాజెక్ట్ మొదలు పెట్టేందుకు కామన్ ఇంట్రెస్ట్ గ్రూప్లైన కన్స్ట్రక్షన్, డొమెస్టిక్, ట్రాన్స్పోర్ట్, కేర్, వేస్ట్ వర్కర్లతో మొత్తం 150 గ్రూపులతో సిద్ధంగా ఉన్నందుకు మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ జాయింట్ సెక్రెటరీ కుల్దీప్ నారాయణ్ అభినందించారు. ఈ పైలెట్ ప్రాజెక్టు లో భాగంగా అర్హత కలిగిన లబ్ధిదారులకు కేంద్ర సంక్షేమ పథకాలు అందించటం, సెల్ హెల్ప్ గ్రూప్స్, కామన్ ఇంట్రెస్ట్ గ్రూప్స్, ఏర్పాటు చేయటం, ఈ గ్రూపులు తయారుచేసిన వస్తువులను మేళ ద్వారా ఎగ్జిబిషన్లో ద్వారా వాళ్లను ప్రోత్సహించటం, కేర్ క్లస్టర్స్,డే కేర్ సెంటర్స్, షెల్టర్స్, ఇలాంటివి ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవటమే ఈ పైలెట్ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి చంద్రశేఖర్, అడిషనల్ మిషన్ డైరెక్టర్ కేఎన్ వెంకటేశ్వరరావు, స్టేట్ మిషన్ మేనేజర్లు ఆర్. ఆదినారాయణ, వి. ప్రభావతి, జి. రంగాచార్యులు, ఎన్. ఎన్. ఆర్. శ్రీనివాస్, జాయింట్ డైరెక్టర్ అమత్ మరియు ప్రాజెక్ట్ ఆఫీసర్ యు సి డి ఇంచార్జ్ డాక్టర్ లత, టెక్నికల్ ఎక్స్పర్ట్లు ఫణి కుమార్, శేఖర్, శ్యామల, సుజాత, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



యువకుడిపై బీరు సీసాతో దాడి

ప్రజాశక్తి - భవానీపురం : విజయవాడ గొల్లపూడిలో పట్టపగలు యువకుడిపై బీరు సీసాతో మరో యుకుకుడు దాడికి పాల్పడ్డాడు. ఇద్దరు వ్యక్తుల మధ్య ప్రేమ వ్యవహారమే ఈ దాడికి పాల్పడినట్లు తెలుస్తుంది. గొల్లపూడికి చెందిన ప్రియ (20) భవానీపురంకు చెందిన గడ్డం సాయి చరణ్ (25)లకు రెండేళ్ల పాటు పరిచయం ఉంది. అయితే ఇటీవల కాలంలో ప్రియ, సాయి చరణ్‌పై ఫోక్సో కేసు పెట్టింది. అప్పటి నుంచి ఇద్దరు విడిపోయారు. అదే ప్రాంతానికి చెందిన గోవిందుతో ప్రియ సన్నిహితంగా మెలుగుతోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం గొల్లపూడి కట్ట వద్ద మాజీ ప్రియుడు గడ్డం సాయిచరణ్, ప్రియురాలు మాట్లాడుతుండగా గోవిందు ఒక్కసారిగా వచ్చి బీరు సీసాతో సాయి చరణ్ తలపై దాడి చేసి, గొంతులో పోడిచాడు. అక్కడి నుంచి గొల్లపూడి వన్‌సెంటర్ వరకు వచ్చి దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో సాయి చరణ్ రక్తస్రావంతో తీవ్రగాయాలపాలయ్యాడు. భవానీపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

15 మందికి జరిమానా

ప్రజాశక్తి - విజయవాడ : మద్యం సేవించి వాహనాలు నడిపిన 15 మందికి న్యాయమూర్తి జరిమానా విధించారు. 5వ ట్రాఫిక్ పోలీసు వారు మొత్తం 15 కేసుల్లో నిందితులను శుక్రవారం కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి లెనిన్ బాబు ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున, 9 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

మొదటిపేజీ తరువాయి

సిపిఎంపై విమర్శలు మాని బాధితులను ఆదుకోండి

కట్టుబట్టలతో మిగిలిపోయిన ప్రజలకు సిపిఎం అండగా నిలిచిందన్నారు. 10 రోజులపాటు 15 ఆహార కేంద్రాల ద్వారా 1.75 లక్షల మందికి తమ పార్టీ భోజనాలు పంపిణీ చేసిందన్నారు. దాతలు, తమ పార్టీ సాయంతో కోటి రూపాయలకుపైగా వ్యయం చేసి ప్రజలు కడుపునింపామన్నారు. ప్రజల ఓట్లతో గెలిచిన ఎంఎల్ఎ బొండా స్వయంగా ఎన్ని భోజన కేంద్రాలు ఏర్పాటు చేసి ఎంత మందికి భోజనం పెట్టి ఆదుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. "అన్నీ కోల్పోయాం, మాకు సాయం చేయండి" అని అడిగినందుకు సింగ్‌నగర్లోని ఎంఎల్ఎ కార్యాలయం వద్ద ఓ వ్యక్తిని ఎంఎల్ఎ అనుచరులు చుట్టుముట్టి స్పృహ కోల్పోయేలా కొట్టిన ఘటనలు మీడియా సాక్షిగా అందరూ చూశారని తెలిపారు. ఎన్యుమరేషన్ ప్రక్రియ దగ్గర నుంచి బాధితులకు సాయం అందించే వరకు అడుగడుగునా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందన్నారు. వరదలు వచ్చి రెండు నెలలవుతున్నా సాయం అందకపోవడంతో వేలాది మంది బాధితులు దరఖాస్తులతోసహా కలెక్టరేట్, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని తెలిపారు. బాధితులకు సాయం చేయాలని ప్రభుత్వాన్ని, అధికారులను అడగటం ఎంఎల్ఎ బొండా ఉమాకు వరద రాజకీయంగా కనిపించడం శోచనీయమని పేర్కొన్నారు. బాధితులందరికీ సాయం అందేవరకూ తమ పార్టీ పోరాడుతుందని స్పష్టం చేశారు. సిఎం సహాయ నిధికి రూ.500 కోట్లకుపైగా విరాళాలు వచ్చినా బాధితులకు సహాయం అందించడంలో మీనమేషాలు లెక్కించడం తగదన్నారు. ఎంఎల్ఎ బొండాకు చిత్తశుద్ధి ఉంటే వరద బాధితులందరికీ నష్టపరిహారం అందేలా కృషి చేయాలని హితవు పలికారు. బాధితులు పెట్టుకున్న దరఖాస్తులపై స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె శ్రీదేవి, విజయవాడ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి బి.రమణారావు, నాయకులు కె.దుర్గారావు పాల్గొన్నారు.

వరద సాయంలో ప్రభుత్వం విఫలం

వరద నీటిలో మునిగిపోయారని తెలిపారు. చాలామంది ఇళ్ళలో గృహోపకరణాలు పూర్తిగా వరద నీటిలో తడిసి ఎందుకూ పనికి రాకుండా పోయాయని, సుమారు ఒక్కో కుటుంబానికి రూ. లక్షన్నర పైగా నష్టపోయారని తెలిపారు. సిఎం చంద్రబాబు వరద బాధితులకు గ్రౌండ్‌ఫ్లోర్ వారికి రూ.25 వేలు, మొదటి అంతస్తు వారికి రూ.10 వేలు ఇస్తామని చెప్పిన హామీ నీటి మూటలుగా మిగిలిపోయాయని విమర్శించారు. ప్రభుత్వం రీ ఎన్యుమరేషన్ చేయాలని, ఇంటికి రూ.50 వేలు,, ఆటోకు రూ.25 వేలు, మోటార్ సైకిల్‌కి రూ.10 వేలకు సహాయం పెంచాలని డిమాండ్ చేశారు. దెబ్బతిన్న ఇళ్ల పునర్నిర్మాణానికి రూ.5 లక్షల మేర ఆర్థిక సహాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ ఇంతియాజ్ పాషాకు సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమాణారావు, మాజీ కార్పొరేటర్ గాదె ఆదిలక్ష్మీ, పార్టీ నాయకులు ఎం.కొండా రెడ్డి, ఇ.వి.నారాయణ, ఎస్.సుబ్బారెడ్డి, వెంకటేశ్వరరావు (చౌదరి), కె.సూరిబాబు, అప్పలరాజు, ఐద్వా పశ్చిమ సిటీ అధ్యక్షురాలు కుండనాల శేషుమణి, విక్రం లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రూ అప్ భారాలు రద్దు చేయాలని ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరిట ప్రజలపై మరోసారి మోపిన 8114 కోట్లరూపాయల భారాన్ని వెంటనే రద్దు చేయాలని సిపిఎం కృష్ణాజిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ రాజేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం మచిలీపట్నం రాజుపేట శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ ట్రూ అప్, సర్దుబాటు చార్జీల పేరా ప్రజలపై వేసే భారాలను వెంటనే రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకించాలని కోరుతూ రాజుపేట సబ్ స్టేషన్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిహెచ్ రాజేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం అదా నీతో చేసుకున్న ఒప్పందమే ఈ స్మార్ట్ మీటర్ల బిగింపు అని, దీనివల్ల ఎస్సీ, ఎస్టీ రైతాంగానికి సంబంధించిన సబ్సిడీ రద్దు అయ్యే పరిస్థితి ఉందని కాబట్టి స్మార్ట్ మీటర్ల బిగింపుని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం సీనియర్ నాయకులు కొడాలి శర్మ మాట్లాడుతూ గత ప్రభుత్వం అనేక రకాలుగా ఇప్పటికే ప్రజలపై భారాలు వేసిందని, ఈ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఈ బాదుడే బాదుడు కార్యక్రమాన్ని రద్దు చేస్తామని, పెంచిన కరెంటు చార్జీలను రద్దు పరుస్తామని హామీ ఇచ్చి ఈరోజు ఈ కూటమి ప్రభుత్వం మరోరకంగా ప్రజలపై భారాలు వేస్తుందన్నారు. సిపిఎంనగర కార్యదర్శి బూర. సుబ్రహ్మణ్యం, పి. నాగయ్య, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం నగర కార్యదర్శి కొడాలి సుజాత, ఐద్వా కమిటీ సభ్యులు సిహెచ్ అరుణ కుమారి, బూర భవాని ఈడే రామారావు తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని మోటూరు - మండవల్లి రైల్వే స్టేషన్ మధ్యలో సుమారు 30 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తిని గుర్తు తెలియని రైలు ఢీకొని మృతి చెందినట్లు రైల్వే ఎస్.ఐ వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మృతుని ఎబిఆర్ పేరుతో ఉన్న గులాబీ రంగు టి షర్టు, లైట్ బ్లూ కలర్ ప్యాంట్ ధరించి, గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నట్లు తెలిపారు. ఎవరికైనా మృతుని సమాచారం తెలిసిన ఎడల గుడివాడ రైల్వే ఎస్సై సెల్ నెంబర్ 9440627570 తెలియజేయాలన్నారు.

29న క్రీడా పోటీలకు సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల జట్లు ఎంపిక

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు జిల్లా జట్లు ఎంపిక అక్టోబర్ తేదీలలో 29, 30 నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార అధికారిని కె.ఝాన్సీ లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియచేశారు. 29వ తేదీ మంగళవారం అథ్లెటిక్స్ బ్యాడ్మింటన్, చెస్, హాకీ, క్రికెట్, రెజ్లింగ్ క్యారమ్స్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్ పోటీలు ఎంపిక నిర్వహిస్తామన్నారు. 30 తేదీ బాస్కెట్బాల్, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, కబడ్డీ, ఫుట్‌బాల్, స్విమ్మింగ్, వాలీబాల్, యోగా పోటీల ఎంపిక నిర్వహిస్తామన్నారు. ఎంపికైనటువంటి జిల్లా జట్లు విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం లోనవంబర్ 6 నుంచి 9 లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. ఈ పోటీలలో పాల్గొనేటువంటి వారు ఐడి కార్డు, ఆధార్ కార్డు, మూడు ఫోటోలు తప్పనిసరిగా తీసుకొని రావాలన్నారు. క్రీడాకారులు ఎంపిక సమయంలో క్రీడ దుస్తులను ధరించి పోటీలలో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు కోసం నెంబర్ 9494643658 సంప్రదించాలన్నారు.



ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు చెక్కు అందజేస్తున్న ఏజీఅండ్ ఎస్ఎస్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

సిఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళం

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఏజీఅండ్ ఎస్ఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. 50వేల డిమాండ్ డ్రాఫ్ట్ ఎమ్మెల్యే బోడె ప్రసాద్కు శుక్రవారం అందచేశారు. జిల్లాలో ఇటీవల సంభవించిన వరదలలో నష్టపోయిన బాధితులకు అసోసి యేషన్ తరపున సేకరించిన రూ.1,19,000లో కొంత మొత్తంతో దుస్తులు, ఆహారం కొనుగోలు చేసి పంపిణీ చేయగ మిగిలిన రూ.50వేలు ముఖ్యమంత్రి సహాయనిధికి ఎమ్మెల్యే ద్వారా అందచేసినట్లు అసోసి యేషన్ అధ్యక్ష కార్యదర్శులు సత్తార్, పూర్ణచం ద్రరావు, గౌరవ అధ్యక్షుడు నూకల సాంబశివరావు తెలిపారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ఆర్టీసీ డిపోలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కే హనుమంతరావు తెలిపారు. ఉదయం 11:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, నియోజకవర్గ పరిధిలోని ప్రజలు తమ ప్రయాణ అవసరాలపై సూచనలు సలహాలు ఫోను ద్వారా తెలిజేయాలని కోరారు. ప్రయాణికులు 99 59225466 నెంబర్ కు ఫోన్ చేసి వారి ప్రయాణ అవసరాలను తెలియజేయాలని డిపో మేనేజర్ కోరారు.

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని స్థానిక జిల్లా పరిషత్ సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ నవంబర్ 20వ తేదీన జరగనున్న సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికల ప్రక్రియ నిర్వహణపై రెవిన్యూ, నీటిపారుదల శాఖ అధికారులకు నిర్వహించిన శిక్షణ తరగతుల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాదేశిక నియోజకవర్గం ఆధారంగా ఓటర్ల జాబితా తయారు చేయడం, సజావుగా ఎన్నికల నిర్వహణ చేపట్టటం ఈ ప్రక్రియలో ముఖ్యమైన అంశాలని, దీనిపై ఆయా శాఖల అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. డివిజన్ స్థాయిలో సైతం ఈ శిక్షణ తరగతులను నిర్వహిస్తామన్నారు. 18 సంవత్సరాలు నిండి పట్టాదారు భూపత్రాలు కలిగిన రైతులను గుర్తించి ఓటరు జాబితాను రెవెన్యూ సిబ్బంది తయారు చేస్తారని, అదేవిధంగా నీటిపారుదల శాఖ అధికారులు ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తారని తెలిపారు. ఈ ఎన్నికలకు



కలెక్టర్ జిల్లా ఎన్నికల అథారిటీ, జాయింట్ కలెక్టర్ అదనపు జిల్లా ఎన్నికల అథారిటీగా వ్యవహరిస్తారని, మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు రెవెన్యూ డివిజన్లకు ఆర్డీవోలు డిప్యూటీ జిల్లా ఎన్నికల అథారిటీగా వ్యవహరిస్తారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కె చంద్రశేఖర రావు, మచిలీపట్నం ఆర్డీవో కే స్వాతి, డ్రైనేజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోపీనాథ్, తహసీల్దారులు, ఇరిగేషన్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మొవ్వ సంగీతరావు మృతికి నివాళి



ప్రజాశక్తి-తోట్లవల్లూరు : తోట్లవ ల్లూరు లోని దళితుల భూములు దళితులకు దక్కాలని పోరాటం సాగించి, 23 మంది దళితులకు నాయకత్వం వహించిన మొవ్వ సంగీతరావు(65) అనారోగ్యంతో మృతి చెందారు. సిపిఎం సీనియర్ నాయకులు జుజ్జువరపు యోసేపు, ఈడుపుగంటి డేవిడ్ రాజు, ఈడుపుగంటి నాగేశ్వరరావు తదితర సిపిఎం నాయకులు శుక్రవారం సంగీతరావు మతదేహానికి నివాళులర్పించారు.

చంద్రపాల్‌కు మాతృ వియోగం




ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఎల్ఐసి యూనియన్ జోనల్ సహాయ కార్యదర్శి, సిపిఎం సభ్యులు టి. చంద్రపాల్ మాతృమూర్తి టి వరదానమ్మ (90) శుక్రవారం సాయంత్రం ఇంటి వద్ద మృతి చెందారు. వరదానమ్మ మృతి పట్ల సిపిఎం జిల్లా కమిటీ, నగర కమిటీ ,సిఐటియు జిల్లా కమిటీ లు సంతాపం తెలియజేస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వరదానమ్మ అంతిమ యాత్ర శనివారం జరుగుతుందని చంద్ర పాల్ తెలిపారు.

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం

ప్రజాశక్తి-గన్నవరం : పూర్వ విద్యార్థులు పాఠశాలలకు తరగని సంపద అని ముస్తాబాద జడ్పీహైస్కూల్ హెచ్ఎం. శ్రీపతి వెంకట రామ్ గోపాల్ పేర్కొన్నారు. 1985-86 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు స్థానిక హైస్కూల్లో విద్యార్థుల సౌకర్యార్థం రూ.5 లక్షల రూపాయల నిర్మాణ వ్యయంతో నిర్మించే వేదిక(కళామండపం) నిర్మాణానికి శంఖుస్థాపన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో హెచ్ఎం మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు చిత్తశుద్ధి, అంకిత భావంతో భవిష్యత్ తరాల వారికి ఉపయోగపడే విధంగా వేదిక నిర్మించటం అభినందనీయమన్నారు. విశ్రాంత హెచ్ఎం ఎంవి సుబ్బారావు పూర్వ విద్యార్థుల వితరణను కొనియాడారు. పూర్వ విద్యార్థులు కందిమళ్ళ శ్రీని వాసరావు, చిన్ని. ఎన్.శ్రీనివాసరావు, చిమట ఏడుకొండలు, లక్ష్మీ, ప్రకాష్ సర్పంచ్ వి.రాధాకృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు షేక్ మున్ని పాల్గొన్నారు.



కళామండపానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం



పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-కంకిపాడు : మండలంలోని మంతెన జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థి, కొండవీటి వెంకటసురేష్ 'ఎస్ఆర్ఐ) దాతత్వంతో నోట్ పుస్త కాలు, పెన్సిల్‌తో కూడిన కిట్‌లను గ్రామ స్టుడు నెక్కలపూడి బాలప్రసాద్ చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. సురేష్ స్ఫూర్తితో మరింత మంది దాతలు ముందుకు రావాలని సర్పంచ్ వీరంకి వెంకట రమణ అన్నారు. ఇందులో దాత తండ్రి రత్తయ్య, తాత వెంకటేశ్వ రరావు, వీరంకి దుర్గా నాగేశ్వరరావు, హెచ్ఎం రత్నకుమార్, కళ్యాణి, అధ్యాపకులు ఫణీంద్ర, నాగేంద్ర పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి-ఉంగుటూరు : రొమ్ము కేన్సర్‌ను అవగాహనతో నిర్మూలించవచ్చని డాక్టర్ పాటిబండ్ల అనీలా అన్నారు. శుక్రవారం తేలప్రోలు ఉషారమా ఇంజనీరింగ్ కళాశాల, ఉమెన్ ఎంపవర్మెన్ అండ్ గ్రీవెన్స్ సెల్ వారు, రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న డాక్టర్ అనీల మాట్లాడుతూ రొమ్ము క్యాన్సర్ ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మందిని ప్రభావితం చేస్తుందని, ఈ వ్యాధి గురించి అవగాహన అవసరం అని అన్నారు. దానితోపాటు ఆత్మ విశ్వాసంతో వ్యాధిని గుర్తించి ఎదుర్కొనే ధైర్యం కావాలన్నారు. రోగ నిర్ధారణ, చికిత్స, నివారణ చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్, శ్రీ సుంకర రామబ్రహ్మం, ప్రిన్సిపాల్ డా. జి. వి. కె. ఎస్.వి. ప్రసాద్, ప్రోగ్రాం కన్వీనర్ డా. రెబ్బా భార్గవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొ న్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ అనీల

ప్రజాశక్తి-కంకిపాడు : లయన్స్ క్లబ్ కంకిపాడు ఆధ్వర్యంలో గొడవర్రు హైస్కూల్‌లో జరిగిన క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. లయన్ బొబ్బా హరినాధబాబు, జిల్లా కోఆర్డినేటర్ నాగమల్లేశ్వర రావు లు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గోవిందరావు, జిల్లా అదనపు కార్యదర్శి హెడ్ మాస్టర్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఎంఎల్‌సి ఓటు నమోదు చేసుకోవాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి-గన్నవరం : నవంబరు 6 వరకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని కెవిపిఎస్ నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తగు ధ్రువీకరణ పత్రాలు సమర్పించి తాజాగా ఓటు హక్కు పొందాలన్నారు. ఆన్ లైన్ లేదా ఆఫ్ లైన్ లలో ఎలాగైనా ఓటుహక్కు పొందవచ్చన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - భవానీపురం : వరద బాధితులకు ఫినోలెక్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, ముకుల్ మాధవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక 45వ డివిజన్ బాలాజీ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక 45వ డివిజన్ తెలుగుదేశం నాయకులు మైలవరపు కష్ణ మాట్లాడుతూ వరద బాధితులకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నిత్యావసర సరుకులను అందజేస్తున్న తీరు అభినందనీయమని అన్నారు. దీపావళి సందర్భంగా వరద బాధిత ప్రాంతాల ప్రజలు ఆనందంగా పండుగ చేసుకునేందుకు వీలుగా 17 రకాల సరుకులను స్వీట్లతో సహా ఇవ్వడం అభినందనీయమని చెప్పారు. ఈ కార్యక్రమానికి 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య సహాయ సహకారాలు అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫినోలెక్స్ ఏపీ తెలంగాణ హెడ్ సంకా శ్రీహరిరావు, ఏ. భాస్కర్ రావు మాట్లాడుతూ దీపావళికి వరద ప్రాంతాల ప్రజలు సైతం సంతోషంగా పండుగ చేసుకోవాలని ఉద్దేశంతో ఈ నిత్యావసర సరుకులు 1000 మందికి అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలాజీ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు బి.టి.రమేష్, సెక్రటరీ వెంకటయ్య, ఉపాధ్యక్షులు శరత్ తదితరులు పాల్గొన్నారు.

26న కెబిఎన్‌లో హెచ్‌ఆర్ కాంక్లేవ్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కాకరపర్తి భావనారాయణ కళాశాల ప్లేస్‌మెంట్ అండ్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో ఈ నెల 26న హెచ్‌ఆర్ కాంక్లేవ్‌ను నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాస్ చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో కార్యక్రమానికి చెందిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కంపెనీలు తమ సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించే క్రమంలో అభ్యర్థుల నుంచి ఏ విధమైన అర్హతలను, నైపుణ్యాలను ఆశిస్తాయి, వారికి ఎటువంటి విద్యార్హతలు ఉండాలనే అంశాలపై ఈ సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పలు కంపెనీల హెచ్‌ఆర్‌లు ఈ సదస్సులో పాల్గొని విద్యార్థులు ముఖాముఖి నిర్వహిస్తారన్నారు. విద్యార్థులు అడిగే ప్రశ్నలకు, సందేహాలకు వారు సమాధానాలిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బాలకోటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, పీజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేష్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్‌లో నిర్వహిస్తున్న డ్రైవ్

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ట్రాఫిక్ ఇబ్బందుల పరిష్కార దిశలో భాగంగా వన్ ట్రాఫిక్ ఏసిపి రామచంద్ర రావు ఉత్తర్వుల మేరకు వన్ ట్రాఫిక్ సిఐ ఏ. ఉమా మహేశ్వర రావు తన సిబ్బందితో, కాళేశ్వరరావు మార్కెట్, గద్ద బొమ్మ, తదితర ప్రాంతాల్లో శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రోజు రోజుకి పెరుగుతున్న ట్రాఫిక్ దష్ట్యా రహదారిని ఆక్రమించి ఉన్న వ్యాపార సముదాయాలను, చిన్నచిన్న తోపుడు బండ్లు, రోడ్డుపై అడ్డదిడ్డంగా నిలుపుదల చేస్తున్న ఆటోలను క్రమబద్ధరించారు. ఇలా రోడ్డుపై వ్యాపార సముదాయాలను పెట్టడం వల్ల రోడ్డుపై వెళ్ళు వాహనదారులకు, నడకదారిలో వెళ్లే ప్రజలకు కలిగే ఇబ్బందులను సంబంధిత వ్యాపారస్తులకు అవగాహన కల్పిస్తూ ఈ డ్రైవ్ నిర్వహించడం అయినది. ఈ కార్యక్రమంలో వన్ ట్రాఫిక్ ఎస్సైలు రాజేంద్ర , ఆనంద్, హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, ట్యాంగో కానిస్టేబుల్ మాలిక్, రాంప్రసాదు పాల్గొన్నారు.

దిశ జిల్లా కమిటీ సభ్యురాలిగా కళావతి

ప్రజాశక్తి - నందిగామ :

దిశ జిల్లా కమిటీ సభ్యురాలిగా మండలంలోని జొన్నలగడ్డ గ్రామానికి చెందిన మన్నే కళావతి నియమితులయ్యారు. ప్రభుత్వ ఉత్తర్వుల నియామకపత్రాన్ని మండల పరిషత్ అధికారులు శుక్రవారం మన్నే కళావతికి అందజేశారు.

ఉచిత ఇసుకను అన్ని ప్రాంతాలకూ సరఫరా చేయాలి



మాట్లాడుతున్న నరసింహారావు

ప్రజాశక్తి - విజయవాడ : ఉచిత ఇసుకను అన్ని ప్రాంతాలకు సరఫరా చేసి, ఎన్‌టిఆర్ జిల్లాలోని ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అన్ని క్వారీలను నడుపుతూ ఉచిత ఇసుకను అన్ని ప్రాంతాలకు సరఫరా చేయాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి నరసింహారావు కోరారు. స్థానిక బిఆర్‌టిఎస్‌రోడ్డులోని నండూరి ప్రసాదరావు (ఎన్‌పిఆర్) శ్రామిక భవన్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుకను సరఫరా చేసి, బిల్డింగ్ కార్మికులకు పనులు కల్పించాలని కోరారు. భవన ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పని చేయించి పథకాలను కొనసాగించాలని కోరారు. విజయవాడ నగరంలో నిర్మాణ రంగంలో 36 రకాల వృత్తుల్లో సుమారు లక్ష మంది పైగా కార్మికులు పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారని సెంట్రల్ నియోజకవర్గంలో 40 వేల మంది పైగా కార్మికులు నిర్మాణ రంగం పై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. ట్రాక్టరు ఇసుక రూ.7వేల నుండి 8 వేల చొప్పున అధికార పార్టీ స్థానిక నేతలు వసూళ్లు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. సిఐటియు సెంట్రల్ సిటీ కార్యదర్శి యం.బాబురావు మాట్లాడుతూ నిర్మాణ రంగం పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య విధానాలను తక్షణమే విడనాడాలని అనేక దశాబ్దాల పోరాట ఫలితంగా 2009లో సంక్షేమ బోర్డును సాధించు కున్నట్లు తెలిపారు. 2019లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం మెమో నెంబర్ 1214ను విడుదల చేసి బోర్డు ద్వారా వచ్చే పథకాలను ఆపివేసిందని అన్నారు.దీంతో వేలాది మంది కార్మికులకు పథకాలు అమలు కావట్లేదని ఎన్నికల ముందు టిడిపి కూటమి తమ ప్రభుత్వం అధికారంలో కి వచ్చిన వెంటనే బోర్డును పునరుద్ధరిస్తామని మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చి ఉచిత ఇసుక ఇస్తామని కూడా ప్రకటించిందని, అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తి అవుతున్న హామీని అమలు చేయట్లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు ఎపి జిఎన్‌ఎ రాష్ట్ర ఆఫీస్ బేరర్ల ఎన్నికలు

ప్రజాశక్తి - విజయవాడ :

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల అసోసియేషన్ (ఏపీ జీఎన్‌ఏ) ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ నెల 26న అసోసియేషన్ రాష్ట్ర ఆఫీస్ బేరర్ల ఎన్నిక జరగనుందని ఎన్‌టీఆర్ జిల్లా కోఆపరేటివ్ అధికారి, ఏపీ జీఎన్‌ఏ ఎన్నికల నిర్వహణ అధికారి ఎస్.శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ బైలాస్, ఏపీ సీఎస్ (ఆర్‌వోఎస్‌ఏ) నిబంధనలు-2001 ప్రకారం అత్యంత పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 26వ తేదీ శనివారం విజయవాడ, ఎంజీరోడ్, రాఘవయ్య పార్కు సమీపంలోని కృష్ణా జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ లిమిటెడ్‌లో ఉదయం ఏడు గంటలకు చేపట్టే రాష్ట్ర ఆఫీస్ బేరర్ల ఎన్నిక ప్రక్రియకు సంబంధించిన సమావేశానికి ఎన్నికైన జిల్లా యూనిట్ల ఆఫీస్ బేరర్లు హాజరుకావాలని శ్రీనివాసరెడ్డి సూచించారు. సంబంధిత జిల్లా ఎన్నికల అధికారి జారీచేసిన ఒరిజనల్ డిక్లరేషన్ ఫారం (ఫారం 12)తో పాటు ఫొటో గుర్తింపు కార్డును వెంట తీసుకురావాలని కోరారు.

ఎంఎల్‌సి ఓటును నమోదు చేసుకోవాలి: విబి రాజు



ఓటు నమోదు పత్రాలను చూపుతున్న దృశ్యం

ప్రజాశక్తి - విజయవాడ : స్థానిక రాణిగారితోట మార్బుల్ వర్కర్స్, సీలింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) తూర్పు నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం జరిగింది. కృష్ణా గుంటూరు జిల్లా గ్రాడ్యుయేట్స్ (ఎమ్మెల్సీ) ఓటు నమోదు కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు విజయవాడ తూర్పు సిటీ అధ్యక్షులు విబిరాజు పాల్గొని మాట్లాడారు. రాణిగారితోట ప్రాంతంలో వేలాదిమంది సీలింగ్ వర్కర్స్ మార్బుల్ వర్కర్స్ జీవనోపాధి కోసం ఇతర రాష్ట్రాల నుంచి వలసలు వచ్చారని, దాదాపు వారందరూ 30 సంవత్సరాల నుంచి విజయవాడ, ఎన్టీఆర్ జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో ఉంటున్నారని అన్నారు. వీరందరికీ వలస కార్మికుల చట్టం వర్తించాలని కోరారు. 2021 సంవత్సరానికి డిగ్రీ పూర్తయిన ప్రతి ఒక్కరూ అర్హులని అన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటును ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని కోరారు. సిఐటియు ఆఫీస్ బేరర్స్ టి.చంద్రశేఖర్, బాబు, అలీ, అబ్దుల్ గఫార్ అజరుద్దీన్ ఇమ్రాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ విజేతలకు అభినందనలు



నందిగామలో పవర్ లిఫ్టింగ్ విజేతలను అభినందిస్తున్న ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ కాకాని నగర్ శాసనసభ్యులు కార్యాలయంలో గన్నవరం, కేసరపల్లి గ్రామంలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గెలుపొందిన విజేతలను నందిగామ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య శుక్రవారం అభినందించారు. నందిగామ చెందిన వారియర్స్ జిమ్ వారు గెలుపొందగా బంగారు పతకాలు, సిల్వర్, రజత పతకాలు పొందిన లకావత్ వెంకటేష్, పఠాన్ రహీం, బాలసైదులు, నీరజ్ కుమార్, జాన్ మోజేష్, అబ్దుల్ రహీమ్, ఆదిపూడి సాయి కిషోర్, అక్కల రాజేష్, సుమన్, హేమంత్, స్పందన, రుహిలను శాసనసభ్యులు తంగిరాల సౌమ్య ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ నందిగామకు చెందిన వారియర్స్ జిమ్ వారు పక్క నియోజకవర్గంలో పోటీలకు వెళ్ళి అక్కడ గెలుపొంది నందిగామకు పేరు తీసుకొనిరావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రములో కూటమి నేతలు, క్రీడాకారులు, జిమ్ యాజమాన్యం పాల్గొన్నారు.

టాటా మోటార్స్ కస్టమర్ కేర్ మహోత్సవ్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ :

వాణిజ్య వాహన వినియోగదారుల కోసం సమగ్ర కస్టమర్ ఎంగేజ్‌మెంట్ ప్రోగ్రామ్ అయిన కస్టమర్ కేర్ మహోత్సవ్ 2024ను ప్రారంభించినట్లు టాటా మోటార్స్ ప్రతినిధి ఎస్.కుమార్ తెలిపారు. నగరంలోని టాటా మోటార్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు ఈ కార్యక్రమం డిసెంబర్ 24 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రత్యేకమైన, విలువను పెంచే ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా 2500కి పైగా అధీకృత సర్వీస్ అవుట్‌లెట్‌లలో నిర్వహించబడుతుందని అన్నారు. ఫ్లీట్ ఓనర్లు, డ్రైవర్‌లను కలిసి వారితో సంభాషించేందుకు, వారి అభిప్రాయాలను తెలుసుకునేందుకు ఇది వీలు కల్పిస్తుంది అని తెలిపారు. ఈ మహోత్సవ్ ద్వారా కస్టమర్లు శిక్షణ పొందిన సాంకేతిక నిపుణులచే సంపూర్ణమైన వాహన తనిఖీలు చేయించుకోవచ్చన్నారు. విలువ ఆధారిత సేవలను పొందవచ్చని, మరెన్నో ప్రయోజనాలను పొందవచ్చని అన్నారు. డ్రైవర్లు సంస్థ సంపూర్ణ సేవా 2.0 కార్యక్రమం కింద తగిన ఆఫర్‌లతో పాటు సురక్షిత, ఇంధన సమర్థవంత డ్రైవింగ్ పద్ధతులపై విస్తృత శిక్షణ పొందుతారని తెలిపారు.

జీవన ఎరువుల ఉత్పత్తి కేంద్రం సందర్శన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని గరికపాడు డాక్టర్ కె.ఎల్.రావు కృషి విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్న ప్రాథమిక వ్యసాయ సహకార సంఘ ప్రతినిధులకు సమగ్ర పోషక యాజమాన్యంపై సర్టిఫికెట్ కోర్స్ పదో రోజులో భాగంగా అమరావతి కృషి కేంద్రం, లాంఫారం, ప్రాంతీయ వ్యవసాయ కేంద్రంను సందర్శిచారు. ఈ సందర్శనలో జీవన ఎరువుల ఉపయోగల గురించి, వాటి తయారి విధానం, మొక్కలకు చేస్తున్న ఉపయోగం గురించి నేర్చుకోవడం జరిగిందని సేద్య విభాగం కోర్స్ ఇంచార్జి డాక్టర్. పి. ఎన్. శివ ప్రసాద్ తెలిపారు.



న్యాయమూర్తి సుమతి కుటుంబానికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ :

శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దర్శనార్థం రాష్ట్ర మునిసిపల్, అర్బన్ డెవలప్మెంట్ శాఖ మంత్రి పి. నారాయణ, కేంద్ర హడ్కో అధికారులుతో కలిసి శుక్రవారం ఆలయానికి విచ్చేశారు. ఈ బృందంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హడ్కో సిఎండి సంజయ్ కులశ్రేష్ఠ, డిసిపి ఎం.నాగరాజ్, రిజినల్ చీఫ్ బిఎస్‌ఏ మూర్తి తదితరులు ఉన్నారు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె.సుమతి శుక్రవారం విచ్చేశారు. వీరికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. వీరికి ఆలయ వేద పండితులు వేదాశీర్వచనం చేయగా ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

పశుగణన పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - నందిగామ :

21వ అఖిల భారత పశు గణన ఆంధ్రప్రదేశ్ పోస్టర్‌ను నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆవిష్కరించారు. శుక్రవారం నందిగామ పట్టణం కాకాని నగర్ కార్యాలయంలో పశు సంవర్ధక శాఖ అధికారులు, స్థానిక టిడిపి నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25 అక్టోబర్ 2024 నుంచి 28 ఫిబ్రవరి 2025 వరకు పశుగణన కొనసాగుతుందన్నారు. గ్రామాల్లో, పట్టణాలలోని పశువులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు తదితర వాటి సంఖ్యను పశుగణన లెక్కిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ వెస్లీ, సహాయ సంచాకులు డాక్టర్ కృష్ణమూర్తి, నందిగామ పశువైద్యశాల డాక్టర్ గంటా వెంగళరావు, డాక్టర్ ప్రదీప్, టిడిపి నాయకులు ఏచూరి రాము, కాసర్ల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.




నందిగామలో పశు గణన పోస్టర్లు ఆవిష్కరణ చేస్తున్న దృశ్యం

మందుబాబులం... మేం మందుబాబులం..

- గన్నవరంలో ఎనీ టైం మందు
- రోడ్లపైనే వీరంగం
- పెడనలో గుడికి, బడికి దగ్గరలో మద్యం షాపులు ఏర్పాటు





వెంకి పెళ్ళి సుబ్బి చావు కొచ్చింది అన్నట్లు నిబంధనలు లేకుండా వెలసిన మద్యం షాపులతో ప్రజల ఇక్కట్లకు గురవుతున్నారు. నియోజకవర్గం కేంద్రమైన గన్నవరంలో జోరుగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. పగలూ రాత్రీ తేడా లేకుండా ఎనీ టైం మందు (ఎటిఎం) అన్న పరిస్థితి వుంది. రోడ్లపైనే మందుబాబులు తాగి ఊగుతూ పొర్లుతున్నారు.

ప్రజాశక్తి-గన్నవరం : వెంకట నరసింహపురం వెళ్లే రహదారి పైనే విచ్చలవిడిగా మద్యం తాగుతూ వాహన చొదకులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. పురుషోత్తపట్నం, ముస్తాబాద, సూరంపల్లి గ్రామాలు వెళ్ళే వాహనాలకు ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అటువైపు వెళ్ళాలంటే ఆడవాళ్లు భయాందోళనకు గురౌతున్నారు. మద్యం షాపులు వద్ద నిలబడిమందు తాగుతున్నారు. సెయింట్ జాన్స్ స్కూల్ సమీపంలో మద్యం షాపు ఏర్పాటు భయాందోళనలో విద్యార్థులు ఉన్నారు.ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తున్న మద్యం షాపు నిర్వాహకులు అనే విమర్శ ఉంది. సీఎం చంద్రబాబు ఆదేశాలు భేఖాతరు అవుతున్నాయి. కనుచూపు మేరలో ఎక్సైజ్ శాఖ అధికారులు కనిపించటం లేదు. సామాన్య ప్రజలకు ఇబ్బందులు లేకుండా మద్యం అమ్మకాలు జరపాలని స్వాక్షాత్తు సీఎం చంద్రబాబు ఆదేశాలు ఇచ్చినా పట్టించుకోని పరిస్థితి ఉందంటు న్నారు. సామాన్యులకు,విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఉన్నతాధికారులు చూడాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. మరోవైపు బెల్ట్ షాప్ నిర్వాహకులకు, మద్యం దుకాణాల యాజమాన్యం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. ఏ అధికారులు మిమ్మల్ని ఆపరు పూర్తిస్థాయిలో బెల్ షాపులు నిర్వహించుకోవచ్చు అంటూ ... బెల్ షాపుల నిర్వాహకుల వద్ద డిపాజిట్ రూపంలో 50.నుండి1లక్ష రూపాయల వరకు ఫిక్స్ చేసినట్లు సమాచారం. ఎక్సేంజ్ అధికారులు నిమ్మకునీరు ఎత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు.అంటూ పలువురు ఆరోపణలువున్నాయి.

పెడనలో నిబంధనలు భేఖాతర్

- గుడికి, బడికి దగ్గరలో మద్యం షాపుల ఏర్పాటు

ప్రజాశక్తి-పెడన : పది రోజులు క్రితం కూటమి ప్రభుత్వం అమలుపరిచిన నూతన మద్యం షాపులు నిబంధనలకు విరుద్ధంగా పెడనలో ఏర్పాటు చేశారు. వీటిని పరిశీలించి పర్యవేక్షించి అనుమతులు ఇవ్వాల్సిన ఎక్సైజ్, పోలీస్ అధికారులు మామూళ్ల మత్తులో తూగుతూ నిబంధనలకు విరుద్ధంగా సహకరిస్తున్నారంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణ పరిధిలోని 4, రూరల్ ప్రాంతాల్లో రెండు వైన్ షాపులకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. అయితే ఎక్సైజ్ నియమ నిబంధన ప్రకారం ఏ మతానికి చెందిన ఆలయం, విద్యార్థుల పాఠశాలలకు 100 మీటర్ల పైగా దూరంలోనే వీటిని ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ పట్టణ పరిధిలోని ప్రధాన రహదారి ఆనుకుని ఉన్న 9 నెంబర్ షాపు నాయి బ్రాహ్మణుల సంఘం ఏర్పాటు చేసిన వినాయక, షిరిడి సాయి ఆలయాలకు కేవలం పది మీటర్లు దూరంలోని ఈ షాపును ఏర్పాటు చేయడం పలువురు పట్టణ ప్రజలు అభ్యంతరం చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆలయానికి వెళ్లి వచ్చే మహిళా భక్తులతో పక్కనే ఉన్న మద్యం షాపులోంచి వచ్చే మద్యపాన ప్రియులు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపణలు వెళ్లివ్చుతున్నాయి. అంతేకాకుండా బంటుమిల్లిరోడ్‌లోని హిందూ స్మశాన వాటిక ఎదురుగా ఉన్న షాప్ నెంబర్ ఉన్న మరనాత సంగం రెప్చర్ మహిమాలయం చర్చికి 30 మీటర్ల దూరంలోని ఉంది. దీనివలన చర్చికి వెళ్లే క్రైస్తవ సోదరులపై మద్యం మత్తులో ఆకతాయిలు అల్లర్లు సష్టిస్తున్నారని చెబుతున్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు తలగడదీవి విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి-నాగాయలంక : కృష్ణా జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వరంలో జగ్గయ్యపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల ఎంపికలో ఉమ్మడి కృష్ణా జిల్లా నుండి తలగడదీవికి చెందిన 10వ తరగతి విద్యార్థిని కొక్కిలిగడ్డ సుజాత సీనియర్ విభాగంలో ఎంపికైంది. ఈ నెల 27 నుండి 29 వ తేది వరకు అన్నమయ్య జిల్లా రాయచోటిలో జరుగు పోటీలకు కృష్ణా జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు బండ్రెడ్డి శివరామ్ ప్రసాద్ ఫిజికల్ డైరెక్టర్ చిల్లా వెంకట సుబ్బారావు తెలిపారు. ఎంపికైన విద్యార్థినిని నాగాయలంక మండలి విద్యాశాఖాధికారి టీ. వీఎం రామదాసు, పిసి చైర్మన్ ఏ. మోహన్ లాల్, ఎస్ఎండిసి చైర్మన్ వి. రాంబాబు, గ్రామ సర్పంచ్ బి. వెంకటేశ్వరావు (బుజ్జి) అభినందనలు తెలిపారు.

మా రూటే సెపరేటు..!

- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



ఇసుక అక్రమ రవాణా చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-మోపిదేవి : అక్రమాలకు మద్దతిస్తే అదనపు బాధ్యతలు .. అడ్డుకుంటే బాధ్యతలపై కత్తెర అన్నట్లుగా మోపిదేవి మండల రెవెన్యూలో ప్రస్తుతం పరిస్థితి నెలకొంది. సిఆర్ జెడ్ పరిధిలో ఉన్న ప్రాంతాలలో కృష్ణా నదిలో ఏ విధమైన ఇసుక, బుసక తవ్వకాలు చేపట్టరాదని ఉన్నత న్యాయస్థానం, ప్రభుత్వాలు స్పష్టంగా ఆదేశాలు ఇస్తున్నప్పటికీ మోపిదేవి మండలంలో మాత్రం మా రూటే సెపరేటు అన్నట్లు ఏ నిబంధనలు అయితే మాకేంటి? అన్నట్లు అక్రమ తవ్వకాలు కొనసాగిస్తున్నారు. అక్రమ తవ్వకాలను అడ్డుకుంటున్న కింది స్థాయి రెవిన్యూ ఉద్యోగుల బాధ్యతలపై కత్తెరలు విధిస్తూ.. అక్రమ రవాణాను ప్రోత్సహిస్తున్న వారికి మాత్రం ఆదనపు బాధ్యతలు కట్టబెట్టడం ప్రస్తుతం మండలంలో చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో మోపిదేవి తహసీల్దార్ మాట్లాడుతూ మండలం లో ఇసుక తరలింపు నిషేధం అని పేర్కొన్నారు.

రహదారుల మరమ్మతులకు నిధులు మంజూరు

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఆర్అండ్‌బి రహదారుల మరమ్మతులకు రూ. కోటి 80 లక్షల రూపాయలు మంజూరైనట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చల్లపల్లి, నడకుదురు రోడ్డు మరమ్మతులకు రూ 15 లక్షలు, నాగాయలంక మండలంలోని భావదేవరపల్లి సంగమేశ్వరం రోడ్డుకు రూ 10 లక్షలు, నాగాయలంక నాలీ రోడ్డు మరమ్మతులకు 30 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. అలాగే చల్లపల్లి మండలం రామానగరం నడకుదురు రోడ్డు మరమ్మతులకు రూ 40 లక్షలు, గుడివాడ చల్లపల్లి కొత్తపాలెం రోడ్డు మరమ్మతులకు రూ 30 లక్షలు, రామానగరం నడకుదురు రోడ్డు మరమ్మతులకు రూ 25 లక్షలు, టీ కొత్తపాలెం గుల్లలమోద రోడ్డు మరమ్మతులకు రూ 30 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులతో ప్రధాన రహదారుల సమస్య కొంతమేరకు పరిష్కారం కొంతమేరకు పరిష్కారం అవుతుందని బుద్ధ ప్రసాద్ తెలిపారు.

ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉపాధ్యాయ సేవాదళ్ల సేవాకార్యక్రమాలు అభినందనీయమని డెమోక్రటిక్ పీఆర్టీయు రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డి.శ్రీను అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో గత సంవత్సరం ఉత్తమ పలితాలు సాధించిన ఉపాధ్యాయులను డెమోక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్రశాఖ అనుబంధ సంస్థ ఉపాధ్యాయ సేవాదళ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కాటూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏర్పాటుచేసి కార్యక్రమంలో ఆయన పాల్గొని పాఠశాల విద్యాకుటుంబంలోని 22 ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. శాఖ జిల్లా అధ్యక్షుడు జీవీఎస్ పెరుమాళ్లు, రాష్ట్ర కార్యదర్శి వేములపల్లి రేమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలో 24 అర్జీలు

ప్రజాశక్తి-ఘంటసాల : రీసర్వేలో వచ్చిన భూ సమస్య లు పరిష్కరించుకోవడానికి ఏర్పాటు చేసిన గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రీ సర్వే డీటీ పి.శ్రీనివాసరావు అన్నారు. ఘంటసాల మండలం చిలకలపూడి గ్రామంలో ఇటీవల జరిగిన భూముల రీ సర్వేలో సమస్యలు పరిష్కరించడానికి శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 24 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొణతం విజయలక్ష్మీ, ఆర్ఎ కె.శ్రీనివాసరావు, ఏవో కె.మురళీ కష్ణ, మండల సర్వేయర్ వల్లీపుష్ప, వీఆర్వో మనీషా, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.



పంచారామాలకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి-ఉయ్యూరు : కార్తీకమాసం పురస్కరించుకుని పంచారామా క్షేత్రాల దర్శించుకునేవారి కోసం నవంబరు 3 నుంచి ప్రతి ఆది, సోమవారాల్లో ఉయ్యూరు ఆర్టీసీ డిపో నుండి ప్రత్యేకబస్సు లు నడపునున్నట్టు డిపో మేనేజర్ కెఎస్ఆర్కు ప్రసాద్ తెలిపారు. నవంబరు 3, 4, 10, 11, 17, 18, 24, 25 తేదీల్లో ప్రత్యేక బస్సు సర్వీసులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. రాత్రి 11-45 గంటలకు బస్ స్టాండ్ నుండి బయలు దేరి అమరావతి, భీమ వరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటలో పరమశివుని దర్శించుకుని మరుసటి రోజు రాత్రికి ఉయ్యూరు చేరుకుంటుందన్నారు. సూపర్ లగ్జరీ బస్సుకు చార్జి ఒక్కరికి రూ. 1200, ఎక్స్ ప్రెస్ వెయ్యి రూపాయాలని, ఒకే గ్రామంనుండి 35 మంది భక్తులు ఉం టే అక్కడినుండే బస్సుసదుపాయం కల్పిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 7382893468, 8919366868 సెల్నంబర్లను సంప్రదించ వచ్చని తెలిపారు.

యుటిఎఫ్ గుడివాడ పట్టణ అధ్యక్షులుగా మీరా హుస్సేన్

ప్రజాశక్తి - గుడివాడ : యుటిఎఫ్ గుడివాడ పట్టణ శాఖ అధ్యక్షులుగా మీరా హుస్సేన్, ప్రధాన కార్యదర్శిగా కే సతీష్ కుమార్ ఎన్నికైనట్లు జిల్లా గౌరవ అధ్యక్షులు నీలం ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం స్థానిక అంబేద్కర్ భవనంలో జరిగిన గుడివాడ పట్టణ మహాసభ జరిగింది. ఈ కార్యక్రమంలో కష్ణ గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ్ రావు, మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరావు, రాష్ట్ర కార్యదర్శి కేఏ ఉమామహేశ్వరరావు , జిల్లా అధ్యక్షులు బి కనకారావు, కోశాధికారి మరరీదు వరప్రసాద్ పాల్గొన్నారు. ఈ మహాసభలో మున్సిపల్ ఉపాధ్యాయులకు సంబంధించిన అనేక తీర్మానాలు ప్రతిపాదించి ఆమోదించినట్లు నీలం ప్రభాకర్ తెలిపారు.

వృద్ధాశ్రమాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో వయోవృద్దుల కొరకు వృద్ధాశ్రమాలు నిర్వహించే నిర్వహకులు తప్పని సరిగా వయోవృద్దుల సంక్షేమశాఖ వారి ద్వారా అనుమతి పొందాలని, అనుమతి లేకుండా వృద్ధాశ్ర మాలను నిర్వహిస్తే చర్యలు తప్పవని విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయోవీద్దుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు బి.కామరాజు తెలిపారు. గుర్తింపు ఉన్న వృద్ధాశ్రమాలను మాత్రమే నిర్వహణకు అనుమతిస్తామన్నారు. కావున అనుమతి కొరకు సంబంధిత ధృవపత్రాలతో దరఖాస్తు చేసుకున్న యెడల ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతి పత్రం మంజూరు చేస్తామన్నారు. పూర్తి సమాచారం కోసం కార్యాలయము ఫోను నెంబర్. 08672- 252637ను సంప్రదించాలన్నారు.

రేపటి వరకు ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పొడిగింపు

ప్రజాశక్తి-కలక్టరేట్(కృష్ణా) : ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు ఉచిత డిఎస్‌సి శిక్షణ పొందుటకు గాను అభ్యర్థులు ఆన్లైన్ ద్వారా http://jnanabhumi.ap.gov.in జ్ఞాన భూమి వెబ్ సైట్లో దరఖాస్తు నమోదు చేసుకొనుటకు గాను ఈ నెల 27. తేదీ వరకు గడువు తేదీని పొడిగించినట్లు సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా ఉప సంచాలకులు షాహిద్ బాబు షేక్ తెలిపారు. కావున జిల్లాలో డిఎస్సి శిక్షణను తీసుకొనుటకు అర్హత కలిగిన ఎస్.సి, ఎస్.టి అభ్యర్థులందరు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశమును సద్వినియోగం చేసుకోవాలని జ్ఞప్తి చేశారు. మరింత సమాచారం కోరకు http://jnanabhu mi.ap.gov.in చూడాలన్నారు.

5న నాగులచవితి ఉత్సవాలు

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి గ్రామంలోఉన్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో నాగులచవితి ఏర్పాట్లు విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులతో శుక్రవారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వచించారు. నవంబర్ ఐదవ తేది మంగళవారం తెల్లవారు జామున 2.30 గంటలకు నాగపుట్ట పూజ, 3 గంటలకు శ్రీ స్వామి వారికి పంచామత అభిషేకాలు జరిపిన అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతించనున్నట్లు డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి డి. శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. తాసిల్దార్ శ్రీవిద్య, సీఐ ఈశ్వరరావు, యస్.ఐ సత్యనారాయణ, పి.హెచ్.సి వైద్యులు లక్ష్మీ నాథ్, ఎండిఓ స్వర్ణ భారతి, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ నాగలక్ష్మి, విద్యుత్ శాఖ ఏఈ పాండురంగారావు పాల్గొన్నారు.



గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు గురించి వివరిస్తున్న నాయకులు

లక్ష్మణరావుకు మద్దతుగా ఓటు నమోదు

ప్రజాశక్తి - మైలవరం : మార్చిలో జరగబోయే కృష్ణ గుంటూరు గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో ప్రజాసంఘాల పిడిఎఫ్ తరపున పోటీ చేస్తున్న కెఎస్.లక్ష్మణరావుకు మద్దతుగా శుక్రవారం మైలవరం మండల యుటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డిగ్రీ పీజీ అభ్యర్థులను కలిసి పూర్తిచేయాల్సిన ఫారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మైలవరం మండలం యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి వాడపల్లి వసంతరావు, యుటిఎఫ్ జిల్లా నాయకులు రత్నకమల్, సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'ఉచిత బస్సు' హామీని అమలు చేయాలి : బొర్రా

ప్రజాశక్తి - మైలవరం : మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని వెంటనే అమలు చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొర్రా కిరణ్ డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం గత ఎన్నికల సందర్భంగా సూపర్ సిక్స్ పథకాలు ఇస్తామని చెప్పిందని నేటికీ ఏ ఒక్క హామీని అమలు చేయలేదని నిరసిస్తూ శుక్రవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌టిసి బస్టాండు వద్ద పోస్టుకార్డు ఉద్యమాన్ని చేపట్టారు. అనంతరం మైలవరం నుండి విజయవాడ వెళ్లే బస్సులో నాయకులతో కలిసి మహిళలతో మాట్లాడుతూ కొండపల్లి వరకు ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం మహిళల ఓట్లతో అధికారంలోకి వచ్చిందని మహిళలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి పోతురాజు ఏసుదాసు, నాయకులు గొంది సురేష్, సేలంరామకృష్ణ, దోసపాటి గిరి కుమార్, పిట్టల నాగేశ్వరరావు, అన్నవరపు దుర్గారావు, అక్కల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



మైలవరం ఆర్టీసీ బస్టాండ్‌లో ప్లకార్డులతో కాంగ్రెస్ నాయకులు



నెల రోజుల పాటు పశుగణన

ప్రజాశక్తి - తిరువూరు : ఈ నెల 25 నుంచి 2025 ఫిబ్రవరి 25వ తేదీ వరకు సమగ్ర పశుగణన సర్వే జరుగుతుందని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ టి.శ్వేత తెలిపారు. మండలంలోని వావిలాల పశు వైద్యశాల్లో శుక్రవారం 21వ అఖిల భారత పశుగణన వాల్ పోస్టర్లను ఆమె సిబ్బందితో కలిసి ప్రారంభించారు. రైతులందరూ తమ పశువులను పశుగణనలో చేర్చాలని కోరారు. ఈ సమగ్ర సర్వేలో గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలు, కోళ్ళు, పక్షు లు ఇలా 16 రకాల పెంపుడు జంతువుల సమాచారం సేకరించి సంబంధిత పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సిబ్బందికి సూచించారు. రైతులు తమ ఇళ్లకు వచ్చే ఎన్యుమరేటర్లు (విషయ సేకరణదాలు) లకు పశుపక్షాదులకు సంబంధించిన సమగ్ర సమాచారం అందించాలని కోరారు. తద్వారా పశుగణ రంగ పథకాల రూపకల్పనకు దోహదపడుతుందని డాక్టర్ వివరించారు. వావిలాల గ్రామ సర్పంచ్ అలవాల రాధ, పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన సామినేని

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, తెలంగాణ భారీ నీటిపారుదల శాఖ మంత్రి, కోదాడ శాసనసభ్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డిని శుక్రవారం హైదరాబాదులో జిల్లా జనసేన అధ్యక్షులు సామినేని ఉదయభాను, ఆర్యవైశ్య మహాసభ వర్కింగ్ అధ్యక్షులు, వైశ్యరత్న చారు గుండ్ల వెంకట లక్ష్మీ నారాయణ (కోండ) మర్యాదపూర్వం కలిశారు.

ఇయు కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగ్గయ్యపేట ఆర్టీసీ డిపోలో అసిస్టెంట్ మేనేజర్ నియంత్రత్వ, నిరంకుశ, ఏకపక్ష ధోరణి, ఉద్యోగస్తులను జంతువులతో పోలుస్తూ నోటికి వచ్చినట్లు దూషిస్తున్న విషయాలపై డిపో మేనేజర్ వైఖరి ఉదాసీనతగా ఉండుటను నిరసిస్తూ, డిపోలో జరుగుతున్న అనేక అవినీతి అక్రమ ఆరోపణలను వ్యతిరేకిస్తూ ఎంప్లాయిస్ యూనియన్ డిపోలో ధర్నా నిర్వహించారు. అనంతరం విజయవాడ సెక్యూరిటీ విజిలెన్స్ అధికారికి డిపోలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షులు కల్యాణం కృష్ణారావు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పసుపులేటి శ్రీనివాసరావు, డిపో కార్యదర్శి ఎ.ఆనంద్, డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జె.సాంబశివరావు, షేక్ జిలాని, అధిక సంఖ్యలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కార్మికులు

గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఓట్ల చేర్పింపు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : పిడిఎఫ్ ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు సూచన మేరకు ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో జ్యోతి రావు పూలే బిసి రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో 22 మంది టీచర్స్‌తో ఓట్ల చేర్పింపు కార్యక్రమం నిర్వహించారు. కొండపల్లి జ్యోతిరావు పూలే బిసి రెసిడెన్షియల్ హాస్టల్‌లో ఓట్ల చేర్పింపు కార్యక్రమం నిర్వహించి ప్రిన్సిపల్ కె.రామ్మోహన్ రావు నుంచి మిగిలిన టీచర్స్ నుంచి అప్లికేషన్స్ తీసుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ నిరంతరం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని సిపిఎస్ రద్దు చేయాలని, కాంట్రాక్టు వర్కర్స్ కనీస వేతనం అమలు చేయాలని - పర్మినెంట్ చేయాలని అంగన్వాడీ 42 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వ అధికారులతో సంప్రదింపులు జరిపేందుకు కోసం పిడిఎఫ్ ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు చేశారని, కార్మికులకు ప్రతినిధిగా శాసనమండలిలో ఉండాలని చదువుకున్న యువత, ఉద్యోగ కార్మిక సంఘాలు పిడిఎఫ్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని ఓట్లు చేర్పింపు అధిక సంఖ్యలో చేసి మద్దతు తెలపాలని కోరారు.



ప్రిన్సిపల్‌కు ఓటు నమోదు పత్రం అందజేస్తున్న దృశ్యం

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని టీచర్స్ కో ఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో శుక్రవారం యుటిఎఫ్ జగ్గయ్యపేట మండల శాఖ అధ్యక్షురాలు జి.పల్లవి అధ్యక్షతన మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జగ్గయ్యపేట మండల శాఖకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల శాఖకు నూతన అధ్యక్షులుగా అల్లిక నరసింహారావు, ప్రధాన కార్యదర్శిగా జి ముక్తేశ్వరావు లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా వివి.సుబ్బా రావు, సహాధ్యక్షులుగా డి.రత్న ప్రసాద్, సహాధ్యక్షు రాలిగా బి.భాగ్యలక్ష్మి, కోశాధికారిగా వి.దుర్గాప్రసాద్, కార్యదర్శులుగా ఎండి.మునీర్ బాషా, డి.విద్యాసాగర్, వై.రవి, ఎం.దేవదానం, కె.వెంకటరత్నం, జి.నెహెమ్యా, బి.ప్రసాద్, ఎం.శ్రీవిద్య, పి.శ్రీదేవి, కె.విజయలక్ష్మి, టివి.సుజాత, జిల్లా కౌన్సిలర్లుగా కె.హనుమంతరావు, పి.రవికుమార్, జి.పల్లవి, పి.శ్రీనివాస రావు, టి.జయసుధ, ఎస్.వి.నిర్మల, సిహెచ్.ఎస్.ఎన్. మూర్తి, టి.ప్రసాద్ బాబు, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరావు ఎన్నికల అధికారిగా, జిల్లా సహాధ్యక్షులు ఎం.కృష్ణయ్య ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు.

రాంకో సిమెంట్స్‌లో గనుల భద్రతా వారోత్సవాలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని ధర్మవరపాడు తండా గ్రామంలో గల స్థానిక రాంకో సిమెంట్స్ లిమిటెడ్‌లో 39వ గనుల భద్రత వారోత్సవాలను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్, హైదరాబాద్ రీజినల్ మార్గదర్శకత్వంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎ.నాగేంద్ర, ఇండియా సిమెంట్ అడిట్ బృంద సభ్యులు ఎం.విశ్వనాథ్ రెడ్డి, సాగర్ సిమెంట్స్ ఎ.శ్రీనివాస రావు (ఏపీ ఎం డి సి) ఈ నెల 24 నుండి 25 వరకు తనికి చేసి ముగింపు కార్యక్రమంలో రాంకో సిమెంట్స్ లిమిటెడ్ వారు భద్రతకు అత్యంత ప్రాముఖ్యతనిస్తుందనీ, వివిధ భద్రతా విధానాలను పాటిస్తుందని వివరించారు. జయంతిపురం, రవిరాలా, బూధవాడ గనులను పరిశీలించి, దాని భద్రతా విషయాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, స్లోగన్, పోస్టర్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రెసిడెంట్ మాన్యుఫాక్చరింగ్ ఆశిష్ కుమార్ శ్రీవాసవ మాట్లాడుతూ కార్మికులకు భద్రతా విషయాలపై అవగాహన కల్పించి హెల్మెట్, జాకెట్, షూస్ తప్పనిసరి గా ప్రతి ఒకరు ధరించి భద్రతను పాటించాలని తెలిపారు. కర్మాగారం ఆవరణలో సెల్‌ఫోన్ వాడకూడదు, జీరో ఆక్సిడెంట్స్ సాధించాలని ప్రతిజ్ఞ చేయించారు.

2013 భూసేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలి : పి.వి.ఆంజనేయులు

సిపిఎం వీరులపాడు మండల కార్యదర్శిగా చాట్ల రవి ఎన్నిక

ప్రజాశక్తి - వీరులపాడు : అమరావతి - ఎర్రుపాలెం రైల్వేలైన్ కింద భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. జుజ్జూరు కేంద్రంలో సిపిఎం వీరులపాడు మండల ఎనిమిదవ మహాసభలు కోడూరు పిచ్చేశ్వరావు, అద్దంకి స్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా చాట్ల రవి, మండల కమిటీ సభ్యులుగా పల్లె కంటి బాబు షేక్ లాల్ అహ్మద్ గడ్డం ప్రభాకరు అద్దంకి స్వామి మారపాక శీను బాబు, గుంజి వీరయ్య మరియు చాంద్ బేగంను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆంజనేయులు సిపిఎం ప్రజా సమస్యపై నిలబడి పనిచేస్తుందని సూత్ర బద్ధ రాజకీయాలతో దేశంలో రాష్ట్రంలో నడుస్తుందని అన్నారు. ఈ నేపథ్యంలోనే రైతాంగ కార్మిక వ్యవసాయ కార్మిక సమస్యల పైన సిపిఎం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందని అన్నారు. ఈ మధ్యకాలంలో రైల్వే జోన్ పేరుతో అమరావతి ఎర్రుపాలెం రైల్వే లైన్ కింద ప్రభుత్వం భూములు సేకరిస్తుంద న్నారు. భూములు కోల్పోయే రైతులకు 2013 భూ సేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని వారికి న్యాయం జరిగిన తర్వాతనే రైల్వే జోన్ పనులు ప్రారంభించాలని ఆయన అన్నారు. కూడలి దాములూరు మధ్య కట్టలేరు పైన బ్రిడ్జి నిర్మించిందని దానికి రోడ్డు నిర్మించాలని వరదలకు కొట్టుకుపోయిన రోడ్లను మరమ్మత్తులు చేసి బాగు చేయాలని, వరదల్లో నష్టపోయిన రైతులు, కౌలు రైతులు ఆదుకోవాలని ఆయన అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట కళ్యాణ్ జిల్లా కమిటీ సభ్యులు చనుమోలు సైదులు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు వట్టికొండ పార్థసారథి ,రమేషు మంగళపూడి.సుందర్రావు, షేక్ చాంద్ బేగం వివిధ గ్రామాల నుంచి సిపిఎం సభ్యులు సానుభూతిపరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.వి.ఆంజనేయులు

కుక్కల బెడద

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో కుక్కల స్వైర్యవిహారంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రాత్రి, పగలని లేకుండా బాటసారులు, వాహనాలు అని తేడా లేకుండా ఎక్కడికక్కడే ఎగబడుతూ, వెంటబడుతూ ఉన్నాయి. మండల కేంద్రంలో రాత్రి సమయాల్లో మెయిన్ రోడ్డుపై వెళ్లే ప్రయాణికుల వెంటబడుతూ అడుగు కూడా ముందుకు కదలనీయడం లేదు. ఒక్కసారిగా గుంపులుగా వచ్చి ద్విచక్ర వాహనంపై దాడి చేస్తున్నాయి. దీంతో వాహనదారులు భయంతో వణికి పోతున్నారు. సంబంధిత అధికారులకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వ్యవసాయ అధికారులకు అవగాహన

ప్రజాశక్తి - మైలవరం : మైలవరం సబ్ డివిజన్ పరిధిలోని మైలవరం, జి.కొండూరు ఇబ్రహీంపట్నం మండలాల్లోని విఎఎలు, విహెచ్ఎలు, ఎంపిఇఒలకు శుక్రవారం పంటలలో తెగుళ్ల గుర్తించటంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డిడిఎ టి.మాధవి లత పంటల్లో పురుగులు, తెగుళ్ల, గుర్తించి ప్రభుత్వం వారు ఇచ్చిన యాప్‌లో ఫొటోలు తీసి పెడితే శాస్త్రవేత్తల నుండి సమాధానాలు పంపబడతాయన్నారు. యాప్ వాడేలా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కెవికె గరికపాడు ఎస్ఎంఎస్ ఎ.రాజశేఖర్, పి.మోనిషా, ఎడిఎ, ఎం.శ్రీనివాసరావు, మైలవరం, జి.కొండూరు ఎంఎఒలు సంధ్యారాణి, రామ్ కుమార్లు పాల్గొన్నారు.

పరామర్శ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని చిల్లకల్లు గ్రామంలో ఇటీవల మరణించిన వారి కుటుంబాలను శుక్రవారం గ్రామానికి చెందిన సంపతి భద్రమ్మ, శివరాత్రి రంగా ఇటీవల మరణించారు. విషయం తెలుసుకొన జనసేన జిల్లా అధ్యక్షులు మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను వారి స్వగృహాలకు వెళ్ళి వారి కుటుంబాలను పరామర్శించారు. వైస్ ఛైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ కొలగాని రాము, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

బాదంతో సమతుల్య ఆహారం

ప్రజాశక్తి - విజయవాడఅర్బన్ : ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన ఆహారం తీసుకోవడంతో పాటు ఆహారంలో బాదం వంటి పదార్థాలను నిత్యం వాడటం వలన పూర్తి ఆరోగ్యంగా ఉంటారని ప్రముఖ పోషకాహార నిపుణులు కె.నీరజ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆరోగ్యానికి ఆహారం అనే అంశంపై సదస్సు శుక్రవారం జరిగింది. పండుగలు, ఇతర శుభకార్యాలు సందర్భంగా బాదంతో చేసిన స్వీట్లు, బాదం పదార్థాలను ఇవ్వడం వల్ల వారు నిత్యం బాదం ఉపయోగించడానికి అవకాశం ఉంటుందన్నారు. బాదంతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల పూర్తి ఆరోగ్యంతో పాటు అన్ని రకాలైన పోషకాలు అందుతాయని తెలిపారు. బాదం పప్పులో ప్రోటీన్, కాల్షియం, జింక్, డైటరీ, ఫైబర్, మెగ్నీషియం వంటి 15 ముఖ్యమైన పోషకాలు, విటమిన్ ఇ ఉంటుం దన్నారు ప్రతిరోజూ గుప్పెడు బాదం పప్పును తీసుకోవడం వలన కార్బొహైడ్రేట్ ఆహారాలు ప్రభావాన్ని తగ్గించడం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుందన్నారు.

జీవనోపాధికి హస్తకళలు దోహదం : కలెక్టర్

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : గ్రామీణ ప్రజల జీవనోపాధికి హస్త కళలు దోహదం చేస్తాయని, వాటర్ హయసింత్ (గుర్రపు డెక్క) కళ పర్యావరణానికి అనుకూలమైనదని, ఈ కళను ఆసక్తిగా నేర్చుకుని మీ పొరుగు గ్రామాల మహిళలకు నేర్పించాలని, తద్వారా జీవనోపాదులు మెరుగుపరచుకోవాలని జిల్లా కలెక్టర్ డికె బాలాజీ శిక్షణ పొందే మహిళలకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేపాక్షి హస్త కళలు సహకారంతో వాటర్ హయసింత్(గుర్రపు డెక్క) కళలో గ్రామీణ మహిళలకు నిర్వహిస్తున్న నైపుణ్యాభివద్ధి శిక్షణ కార్యక్రమం జిల్లా కలెక్టర్ శుక్రవారం బందరు మండలం చిన్నాపురం గ్రామంలో ఎస్సి కాలనీ కమ్యూనిటీ హాల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత ప్లాస్టిక్ యుగంలో పర్యావరణానికి హానికరం కాని ఎకో ఫ్రెండ్లీగా, ఈ ప్రాంతంలో విరివిగా లభించే గుర్రపుడెక్క వినియోగించి కళాకతులు తయారు చేయడంలో లేపాక్షి సహకారంతో మహిళలకు శిక్షణ ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. మహిళలు తయారుచేసిన కళాకతులకు లేపాక్షి ఎంపోరియం ద్వారా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తుం దన్నారు. లేపాక్షి హస్తకళల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం. విశ్వ శిక్షణ కార్యక్రమం గురించి వివరిస్తూ వాటర్ హయసింత్ క్రాఫ్ట్ ను ప్రోత్సహించడానికి 2 బ్యాచ్ లలో 20 మంది చొప్పున 40 మంది కళాకారులకు(మహిళలకు) 4 నెలల పాటు శిక్షణ ఇచ్చేందుకు ఒక ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జిఎం ఆర్ వెంకట్రావు, జిల్లా చేనేత జౌళి శాఖ ఏడి సాయి ప్రసాద్, లేపాక్షి హస్త కళల మేనేజర్ సురేష్, తాసిల్దార్ మధుసూదన్ రావు,కాగిత వెంకటేశ్వరరావు, కాగిత గోపాలరావు తదితరులు పాల్గొన్నారు. -



గుర్రపుడెక్క పరిశీలిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు



ప్రజాశక్తి-మోపిదేవి : మండలంలో ఇసుక రీచ్‌లు లేవనీ, ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని మోపిదేవి తహసీల్దార్ మేడపాటి శ్రీవిద్య తెలిపారు. మోపిదేవి ఎస్ఐ సత్యనారాయణతో కలిసి శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం గుర్తించిన ఇసుక రీచ్‌ల నుంచి మాత్రమే ఉచిత ఇసుకను తీసుకువెళ్లాలన్నారు. మోపిదేవి మండలం సీఆర్‌జడ్ పరిధిలో ఉండటంతో ఇసుక తవ్వకాలకు అనుమతులు లేవన్నారు. ఎడ్లబండ్లతో సైతం ఇసుక రవాణా చేసేందుకు వీలు లేదని స్పష్టంచేశారు. ఘంటసాల మండలం శ్రీకాకుళంలో ఇసుక రీచ్ గుర్తించారని, త్వరలో అక్కడ ఏర్పాటుచేసే స్టాక్ పాయింట్ నుంచి మాత్రమే ఇసుక తెచ్చుకోవాల్సి ఉంటుందని తెలిపారు. సీఆర్ జెడ్ పరిధిలో ఇసుక తవ్వకాలకు పాల్పడితే కఠినతరంగా వ్యవహరి స్తామన్నారు. సమావేశంలో వీఆర్వో బి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ విరలపాల్

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి : ఎంపిడిఓ

ప్రజాశక్తి-పమిడిముక్కల : గ్రామాల్లో మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయాలని, అలాగే చెత్తాచెదారం లేకుండా చూడాలని పమిడిముక్కల మండల అభివద్ధి అధికారి పాల్ అన్నారు. శుక్రవారం మండలంలోని మండల అభివద్ధి కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలని, తాగునీరు లేకుండా చూడాలన్నారు. డ్రైనేజీల్లో చెత్తాచెదారం లేకుండా నీరు పారే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తాళ్లూరు వెంకటరమణ స్వామి, ప్రసాద్, లక్ష్మి, నాగరాజు, మౌనిక, శ్రీను పాల్గొన్నారు

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -గుడివాడ : గుడివాడను అత్యుత్తమ నియోజకవర్గంగా అభివద్ధి చేసేందుకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కషి చేస్తున్నారని, అందులో భాగంగానే కార్మికనగర్‌లోని ముస్లిం శ్మశాన వాటిక(కబ్రస్థాన్)ను అభివృద్ధి చేసేందుకు రూ.37 లక్షలతో పనులు ప్రారంభించడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం కార్మికనగర్‌లో రూ.37.40లక్షల నిధులతో ముస్లిం శ్మశాన వాటిక (కబ్రస్థాన్) అభివద్ధి పనులకు మాజీ ఎమ్మెల్యే రావి ముస్లిం సాంప్రదాయం ప్రకారం శంకు స్థాపన చేశారు. ఈకార్యక్రమంలో జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జి, కామేపల్లి తులసిబాబు, ముల్లపూడి రమేష్ చౌదరి, షేక్ ఇబ్రహీం, పోలాసి ఉమా, షేక్ జానీషరీఫ్ పాల్గొన్నారు.



సిసిరోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రావి

సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన : చౌటపల్లి గ్రామంలో రూ.41.20లక్షలతో సిసి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మాజీ ఎమ్మెల్యే రావి గుడివాడ రూరల్ మండలం చౌటపల్లి గ్రామంలో రూ. ఐదు లక్షల రూపాయలతో ఫిల్టర్ బెడ్ల మరమ్మత్తు పనులు, రూ.41.20 లక్షలతో గ్రామంలో నిర్మించనున్న సిసి రోడ్ల నిర్మాణ పనులకు మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళి, నాయకులు కామేపల్లి తులసి బాబు, చేకూరు జగన్మోహనరావు, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి సభ్యత్వ నమోదు : టిడిపి

ప్రజాశక్తి-ఘంటసాల : గ్రామాల్లో తెలుగుదేశం పార్టీని మరింత విస్తత పరచాలని తెలుగుదేశం పార్టీ అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఘంటసాల మండలం కొడాలి గ్రామంలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి కళ్యాణ మండపంలో టిడిపి నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ నుంచి తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు జరుగుతుందని తెలిపారు. సభ్యత్వ నమోదుకు వంద రూపాయలు చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. ఘంటసాల మండలంలో నూతనంగా మరింత సభ్యత్వాల నమోదును పెంచాలని సూచించారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తుమ్మల చౌదరి బాబు, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకష్ణ పాల్గొన్నారు.

దీపాలంకరణకు టెండర్ ఖరారు

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి గ్రామంలో శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో నాగులచవితి, కార్తీకమాసం నెల రోజులు పాటు విద్యుత్ దీప అలంకరణ చేయుటకు నాగాయతిప్ప వాస్తవ్యులు చాట్రగడ్డ రాజశేఖర్ సీల్డు టెండర్ ద్వారా లైసెన్స్ పొందారు. ఈ కార్యక్రమాన్ని శుక్రవారం పాటదారులు, గ్రామస్తులు, భక్తుల సమక్షంలో ఆలయ ఉపకమీషనర్ కార్యనిర్వాహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు, ఆలయ సిబ్బంది నిర్వహించారు.

340 మందికి ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని అంగలూరు ప్రభుత్వ బాలికల కళాశాల విద్యార్థులకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు నిమ్మగడ్డ శశికళ తెలిపారు. గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 340 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి దష్టి లోపం 34 మందికి వున్నదని వైద్యులు నిర్ధారణ చేసినట్లు తెలిపారు. ఎంఈఓ 1 జి జగన్ మోహన్ రావు, ఉపాధ్యాయులు, లయన్స్ సభ్యులు పెరుమాళ్ళు, వైవీసీ ప్రసాద్, పరంధామయ్య, విజయ్, జి రామకష్ణ, సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి-చల్లపల్లి : స్థానిక పార్వతమ్మ తోటలోని ఆదరణ వృద్ధాశ్రమానికి రిలయన్స్ కమ్యూనిటీ యాక్టివిటీ తరపున రిలయన్స్ స్మార్ట్ బజారు సిబ్బంది నిత్యవసర సరుకులు , వృద్ధులకు మిల్క్,స్వీట్స్,బన్స్ ఫ్రూట్స్ అందించారు. వీరికి ఆశ్రమ నిర్వాహకులు శారా, మేనేజర్ అపర్ణ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపిపారు.

బాధ్యతల స్వీకారం



వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-అవనిగడ్డ : జల వనరుల శాఖ పులిగడ్డ సబ్ డివిజన్ డిఈఈగా పులిగడ్డ వెంకటేశ్వరరావు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటివరకు అవనిగడ్డ ఏఈగా డ్రైనేజీ ఇంచార్జ్ డిఈ గా విధులు నిర్వహిస్తున్నారు. ఉల్లిగడ్డ సబ్ డివిజన్ జల వనరుల శాఖ డిఈఈ గా విధులు నిర్వహిస్తున్న ఆర్ రవి కిరణ్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో పులిగడ్డ వెంకటేశ్వరరావును పూర్తిస్థాయిలో డిఈఈగా బాధ్యతలు చేపట్టారు.



మృతుని కుటుంబానికి సాయం

ప్రజాశక్తి-మొవ్వ : మొవ్వ మండలం టు వీలర్ యూనియన్‌లో సభ్యుడైన కోసూరు గ్రామ కాపురస్తుడు మెకానిక్ కొక్కిలిగడ్డ ఏసురత్నం (45) అనారోగ్యంతో బాధపడుతూ మచిలీపట్నం గవర్నమెంట్ హాస్పిటల్‌లో మృతి చెందారు. యూనియన్ నాయకులు మృతుని కుటుంబానికి పదివేల రూపాయలు ఆర్థిక అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-ఉయ్యూరు : కాటూరులో 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్వహణ, విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సబ్ స్టేషన్ పరిధిలో కాటూరు, రాజుపేట, కడవకొల్లు, పొట్లపాడు, వీరవల్లి, కలవపాముల గ్రామాలలో గృహ, వాణిజ్య, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు శనివారం ఉదయం 7 నుండి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఉయ్యూరు డివిజన్ ఈఈ డి.కష్ణనాయక్ శుక్రవారం ఓప్రకటనలో తెలిపారు. ప్రజాశక్తి - గుడివాడ : శనివారం గుడివాడ పట్టణ విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గుతుందని విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.వి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుండి 1గంట వరకు, విద్యుత్ లైన్స్, సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా అంతరాయం కల్గుతుందని తన ప్రకటనలో తెలిపారు.

పశు గణన ప్రారంభం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వడ్లమన్నాడులో 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని వెటర్నరీ వైద్యాధికారి డాక్టర్ వి.శ్రీవేణి శుక్రవారం ప్రారంభించారు. ఐదేళ్లకు ఒకసారి జరిగే ఈ కార్యక్రమం 2019లో నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఫిబ్రవరి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గొర్రెలు, మేకలు, గేదెలు, ఆవులు, కోళ్ల వంటి పశుగణన చేసి ఆన్లైన్ ద్వారా ఉన్నతాధికారులకు నివేదిస్తున్నామని పేర్కొన్నారు. వెటర్నరీ సిబ్బంది తమ ప్రాంతాల్లోని పశు సంపదను లెక్కించి ఆన్లైన్ ద్వారా ఉన్నతాధికారులకు నివేదించాలని సూచించారు. కార్యక్రమంలో వడ్లమన్నాడు ఉప సర్పంచ్ గరికపాటి రాంబాబు, జనసేన మండల అధ్యక్షుడు పెన్నేరు రమేష్ పాల్గొన్నారు.



పశుగణన వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం


తగలబడుతున్న లారీ

కబేళా సెంటర్‌లో లారీ దగ్ధం

ప్రజాశక్తి - భవానీపురం :
ఓ లారీ దగ్ధమైన సంఘటన విజయవాడ కబేళా సెంటర్లో చోటుచేసుకుంది. శుక్రవారం ఉదయం రాళ్ల లోడుతో కబేళా సెంటర్ వైపు వస్తున్న లారీలో పొగలతో మంటలు ఒక్కసారిగా వ్యాపించాయి. ఇది గమనించిన ఇతర వాహనదారులు లారీ డ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. డ్రైవర్ కిందకు దిగి స్థానికుల సహాయంతో మంటలు పొగ వస్తున్నట్లు గుర్తించారు. ఇంజన్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే ఫైర్ ఇంజన్‌కి ఫోన్ చేశారు. వాళ్లు వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో మంటలు కరెంటు తీగల వరకు వెళ్లేసరికి కబేళా సెంటర్ స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేశారు.

27న ఎన్‌ఎస్‌ఎం పబ్లిక్ స్కూల్‌లో 'కెరీర్ ఫెయిర్'

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ :
ఎన్ఎస్ఎం ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27న పటమటలోని పాఠశాల ప్రాంగణంలో 'కెరీర్ ఫెయిర్'ను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్ చదువుతున్న విద్యార్థులు ఉన్నత విద్యావకాశాల కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారని ఎక్కడ ఎలా చదవాలో తెలియని పరిస్థితి ఉందన్నారు. ఈఅంశాన్ని దృష్టిలో ఉంచుకుని ఎన్ఎస్ఎం ఓల్డ్ స్టూడెంట్స్ ఆధ్వర్యంలో ప్రపంచ ప్రఖ్యాతి చెందిన విశ్వవిద్యాలమాల్లో అందించనున్న కోర్సుల వివరాలను తెలియచేసేందుకు ఈ కెరీర్ ఫెయిర్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. కెరీర్ ఫెయిర్ పటమటలోని ఎన్ఎస్ఎం పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. 10 నుండి 12 తరగతుల విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో వచ్చి కోర్సుల వివరాలు తెలుసుకోవచ్చన్నారు. దేశంలోని 36 ప్రముఖ విశ్వవిద్యాలయాల నుండి ప్రతినిధులు పాల్గొని తమ విద్యా సంస్థల్లో అనుసరిస్తున్న కోర్సులు, ఉపాధి అవకాశాల గురించి తెలియచేస్తారన్నారు. ఎన్.ఎస్.ఎం ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ పాలు సామాజిక, సేవా కార్యక్రమాలతో పాటు విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేలా కెరీర్ ఫెయిర్‌ను కూడా నిర్వహస్తున్నామని తెలిపారు.

శామ్‌సంగ్ మెడికేషన్స్ ట్రాకింగ్ ఫీచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : వినియోగదారులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియచేసేందుకు శామ్‌సంగ్ మెడికేషన్స్ ట్రాకింగ్ ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు సంస్థ డైరెక్టర్ రాజశేఖర్.ఎస్.తెలిపారు. నగరంలోని శామ్‌సంగ్ షోరూమ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. శామ్‌సంగ్‌హెల్త్ యాప్ ద్వారా ఆరోగ్య వివరాలను అందించనున్నట్లు తెలిపారు. ఈ ఫీచర్ వల్ల వినియోగదారులకు ఏమైనా ఇబ్బందులు కలిగినపుడు ఆరోగ్య సలహాలు, మందుల వివరాలను తెలుసుకోవచ్చని తెలిపారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులకు సంబందించి తగిన సూచనలు అందజేస్తారన్నారు. ఏమైనా మందులు అవసరమైన వారికి రాయితీతో పాటు, వైద్యుల పర్యవేక్షణ కూడా ఉంటుందన్నారు. దీనికి సంబంధించిన ఇతర వివరాలకు శామ్‌సంగ్ షోరూమ్‌ల వద్ద గాని లేదా శామ్‌సంగ్ హెల్త్ యాప్ ద్వారా గాని తెలుసుకోవచ్చని తెలిపారు.

27న డయాబ్ ఎండోకాన్ 2024

ప్రఖ్యాత ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ కృష్ణ శేషాద్రికి గోల్డ్ మెడల్ ప్రదానం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : ఈ నెల 27వ తేదీ ఆదివారం నాడు డయాబ్ ఎండో కాన్ 2024 వైద్య సదస్సును నిర్వహిస్తున్నట్లు యలమంచి డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్ చైర్మన్, ప్రఖ్యాత మధుమేహ వైద్య నిపుణులు డాక్టర్ యలమంచి సదాశివరావు తెలిపారు. సూర్యారావుపేటలోని వైడిఆర్ఎఫ్ రీసెర్చ్ సెంటర్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలోని జిఆర్‌టి గ్రాండ్ హోటల్‌లో ఈ సదస్సు జరుగుతుందని చెప్పారు. యలమంచి డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా డయాబెటిస్ సదస్సు నిర్వహిస్తున్నామని, ఎండోక్రైనాలజీ విభాగాన్ని కూడా జతచేసి, ఈ ఏడాది డయాబ్ ఎండో కాన్ 2024కు రూపకల్పన చేశామని అన్నారు. ఈ సదస్సులో 25 మంది నిష్ణాతులైన వైద్య ప్రముఖులు వివిధ అంశాలపై ప్రసంగిస్తారని, మొత్తం 500 మందికి పైగా వైద్యులు హాజరవుతారని పేర్కొన్నారు. ఎండోక్రైనాలజీ, డయాబెటిస్ విభాగాలకు సంబంధించిన ఆధునిక చికిత్సలు, నవీన ఆవిష్కరణల గురించి తెలుసుకునేందుకు ఈ సదస్సు చక్కటి వేదికగా ఉంటుందని అన్నారు. మధుమేహ వ్యాధి చికిత్సల్లో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయని, ఆధునిక చికిత్సా విధానాలపై అధ్యయనం చేసేందుకు, తద్వారా ప్రజలకు మెరుగైన చికిత్సలు అందించేందుకు ఈ సదస్సు ఉపయుక్తంగా ఉంటుందని వివరించారు. వైద్య చికిత్సలు, పరిశోధనా రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న వారికి ప్రతి ఏటా బంగారు పతకాన్ని ప్రదానం చేస్తూ వస్తున్నామని, ప్రముఖ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ కృష్ణ శేషాద్రికి ఈ ఏడాది గోల్డ్ మెడల్ ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. మధుమేహ వ్యాధి చికిత్సా పద్ధతులు పూర్తిగా ఆధునికతను సంతరించుకున్నాయని, నియంత్రణలో శరీర బరువును అదుపులో ఉంచుకోవడం కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. ప్రీ డయాబెటిస్ దశలోనే తగు జాగ్రత్తలు పాటిస్తే మధుమేహం ముప్పు నుండి తప్పించుకోవచ్చని సూచించారు. టైప్-1 డయాబెటిస్‌ను అడ్డుకోవడానికి నూతన ఔషధాలు అందుబాటులోకి వచ్చాయని, శరీర బరువును అదుపులో ఉంచుకోవడం, జీవన విధానాల్లో మార్పులు, సరైన చికిత్సలు తీసుకోవడం ద్వారా మధుమేహ వ్యాధిని తిప్పికొట్టవచ్చని వెల్లడించారు. మధుమేహ వ్యాధి తీవ్రంగా ఉండటం వల్ల గుండెపోటు వంటి అనేక ప్రాణాంతక సమస్యలకు దారితీస్తోందని అన్నారు. మధుమేహం, ఎండోక్రైనాలజీ విభాగాలకు సంబంధించిన అనేక అంశాలపై ఈ సదస్సులో విస్తృత చర్చ జరుగుతుందని తెలిపారు. ఈ సదస్సుకు ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ వారు రెండు సిఎంఇ క్రెడిట్స్ అందిస్తున్నట్లు డాక్టర్ సదాశివరావు చెప్పారు. 2002లో యలమంచి డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్ స్థాపించామని, నాటి నుండి అనేక అవగాహన కార్యక్రమాలు, వైద్య శిబిరాలను నిర్వహిస్తూ వస్తున్నామని డాక్టర్ సదాశివరావు తెలిపారు. డయాబ్ ఎండోకాన్ 2024 బ్రోచర్లను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ సమావేశంలో వైడిఆర్ఎఫ్ ట్రస్టీ డాక్టర్ హిమన యలమంచి, సెక్రటరీ డాక్టర్ ఐశ్వర్య యలమంచి, జాయింట్ సెక్రటరీ డాక్టర్ అమూల్య యలమంచి పాల్గొన్నారు.


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వైద్యులు

చిరువ్యాపారులపై అధికారుల జులుం

షాపుల తొలగింపు : హాకర్స్ యూనియన్, సిఐటియు, సిపిఎం నిరసన

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ లెనిన్ సెంటర్లో 35 సంవత్సరాలు పైగా వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారస్తుల (హాకర్స్)పై శుక్రవారం తెల్లవారు జాము నాలుగు గంటలకు మున్సిపల్, సచివాలయం, పోలీస్ సిబ్బంది బీభత్సం సృష్టించారు. వ్యాపారం చేసుకునే వస్తువులు, బళ్లను సైతం పొక్లైన్లతో తొలగించి రోడ్లపై వస్తువులను పడవేయడంతో పాటు కొన్ని వస్తువులను మునిసిపల్ వ్యాన్లు ఎక్కించుకొని బీభత్సం సృష్టించినందుకు నిరసనగా అక్రమంగా తొలగించిన చిరు వ్యాపారస్తులను యథావిధిగా అక్కడే వ్యాపారాలు చేసుకోవటానికి అనుమతినివ్వాలని కోరుతూ విజయవాడ హాకర్స్, తోపుడు బండ్ల యూనియన్ (సి.ఐ.టి.యు) ఆధ్వర్యంలో లెనిన్ సెంటర్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన జరిగింది. ఆ ప్రాంతంలోని బాధిత హాకర్స్‌తోపాటు సిఐటియు, సిపిఎం నేతలు, కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ పాల్గొని మాట్లాడుతూ దశాబ్దాల తరబడి లెనిన్ సెంటర్‌లో చిరువ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న హాకర్స్‌పై అధికారులు, ప్రభుత్వం జులుం ప్రదర్శించడం దారుణమని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రూ. 60 లక్షలకు పైగా వారికి నష్టం వాటిల్లిందని అన్నారు. సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె.దుర్గారావు మాట్లాడుతూ చిరు వ్యాపారస్తులైన (హాకర్స్)పై ఎటువంటి సమాచారం అందించ కుండా అర్ధరాత్రి సమయంలో చిరు వ్యాపారస్తులను తొలగించడం అన్యాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో హాకర్స్ యూనియన్ నగర కార్యదర్శి వై.సుబ్బారావు, హాకర్స్, తోపుడు బండ్ల యూనియన్ సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు బెవర వెంకటేశ్వరరావు, సిహెచ్.మురళి, నగర నాయకులు బాల బొమ్మ లక్ష్మణ, గోపి, బెవర శ్రీను, రాణి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో వివిధ ప్రాంతాల్లో ఉన్న చిరు వ్యాపారస్తులు ఆందోళనలో పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న హాకర్స్


బుల్డోజరుతో తొలగిస్తున్న దృశ్యం

నేటి నుంచి స్కూల్ గేమ్స్ సైక్లింగ్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విజయవాడ రూరల్ మండలం నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో ఈ నెల 26, 27 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జిఎఫ్ఐ) అంతర్ జిల్లా స్థాయి అండర్ 14, 17, 19 బాలుర, బాలికల సైక్లింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వజ్రాల భూపాల్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని మొత్తం 26 జిల్లాల నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలు జాతీయ రహదారిపై నున్న నుంచి అంబాపురం వరకు జరుగుతాయన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభా కనబరిచిన వారిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఈ పోటీలు స్కూల్ గేమ్స్ ఎన్టీఆర్ జిల్లా పర్యవేక్షణలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సిలబస్‌పై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - తిరువూరు : ఉపాధ్యాయులు తాము బోధించే సబ్జెక్టుకు సంబంధించిన సిలబస్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని మండల విద్యా శాఖాధికారి ఎ.శ్యాంసుందరరావు సూచించారు. జిల్లా విద్యాశాఖ సూచన మేరకు తిరువూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు, ఆంగ్లం బోధించే ఉపాధ్యాయులకు నిపుణులచేత ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రాధానోపాధ్యాయులు ఎస్ఎన్ రాజు, రిసోర్స్ పర్సన్స్ ఎం.రాంప్ర దీప్, వై.రవికాంత్, తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఎ.కొండూరు మండలాల నుండి ఆంగ్ల ఉపాధ్యాయులు హాజరయ్యారు.


మాట్లాడుతున్న ఎంఇఒ శ్యాంసుందరరావు

ఆశ వర్కర్లతో అదనపు పనులు చేయించొద్దు

ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కమల

ప్రజాశక్తి - విజయవాడ :
ఆశ వర్కర్లతో క్లీనింగ్, ఇతర పనులు చేయించడం ఆపాలని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కమల డిమాండ్ చేశారు. ఈ మేరకు కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ నుండి ఉత్తర్వులు ఉన్నప్పటికీ, వాటిని బేఖాతర్ చేస్తూ, ఆశ వర్కర్లతో క్లీనింగ్ పనులు బిపి షుగర్ టెస్ట్‌లు, మందులు ఇవ్వడం, హాస్పటల్ సిబ్బంది రానప్పుడు, ఒపి డ్యూటీలు చేయించడం మానుకోవాలని ప్రకటనలో కమల హెచ్చరించారు. రెండుసార్లు జరిగిన జిల్లా స్థాయి అధికారుల సమక్షంలో జరిగిన జాయింట్ మీటింగ్‌లో జిల్లా వైద్యాధికారి, (డిఎంఅండ్‌హెచ్ఒ) ఎం.సుహాసిని దృష్టికి తీసుకెళ్లామని, వాటిని సరిచేయమని చెప్పినప్పటికీ కూడా, జిల్లాలో ఆశ వర్కర్లకు సంబంధం లేని పనులు చేయించడం దారుణమని అన్నారు. రూ.10వేలు జీతం తీసుకుంటున్నారుగా ఈ పనులు కూడా చేయాల్సిందేనని, చేయకపోతే ఆశా వర్కర్ల ఉద్యోగానికి రాజీనామా చేస్తూ లెటర్లు రాసి ఇవ్వాలని బెదిరించడాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. లేకపోతే జీతం ఆపేస్తామని బెదిరించడాన్ని ఆశ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సంబంధిత ఫొటోలను వీడియోలను జిల్లా అధికారుల దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకెళ్తున్నామని అయినా ఏ మార్పూ కనబడలేదని ఆమె తెలిపారు. పైగా తమకు తెలీకుండా ఫొటోలు జిల్లా డిఎంహెచ్ఒకు ఎందుకు పెట్టారని బెదిరిస్తున్నారన్నారు. వ్యాక్సిన్ క్యారియర్లు మోసినందుకు సంబంధిత అధికారులకు, ఒక్కొక్క సెక్షన్‌కి 275 రూపాయలు చొప్పున, ప్రభుత్వం బడ్జెట్ రిలీజ్ చేస్తుందని, కానీ ఆ డబ్బులు వారు తీసుకుటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కొక్క వెల్‌నెస్ సెంటర్‌కి సంవత్సరానికి రూ.20వేలు చొప్పున ప్రభుత్వం బడ్జెట్ రిలీజ్ చేస్తుందని పేర్కొన్నారు. 104 వచ్చినప్పుడు సిబ్బంది లేరనే పేరుతో అక్కడున్న ఆశ వర్కర్లతో విధులు నిర్వహించడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారి, డిఎంహెచ్ఒ తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఈ సమస్యలపై పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు.